శ్రీ

ఆంధ్రసాహిత్యపరిషత్పత్రిక.

కాకినాడ.

రెండునెలల కొకసారి ప్రకటింపఁబడును.

సంపుటము ౨౫.	ధాతృనామసంవత్సరము. మార్గశిరపుష్యమాసములు.	సంచిక ౫.

పాశ్చాత్యవిజ్ఞానయుతులు, వారిపద్యాదులు.

—: కాశీభట్ట కృష్ణరాయశాస్త్రిగరు :—

హృద్యంబుగ ననవద్యంబుగ గద్యంబు రచింపఁ దలంచి భావప్రధాన మనియో రసప్రధాన మనియో వాదించి యాంగ్లభాషావిష్కృతభావాడంబరఘోరణీప్రవాహదుర్వారనిపాతప్రభూతపరిపాటి నానాసమ్మేళనాందోళనములో వ్రాయుచున్నారు. వీరేశలింగాది మహామహులాంగ్లసంస్కృతు లయ్యు నాంధ్రసంప్రదాయశిక్షితు లయి యాంధ్రసాంప్రదాయిక దివ్యసత్తారాధనీయ గుణానుబంధపూజ్యశీలు రగుటఁ దత్తద్రచనారీతు లుదారవ్యక్తిస్ఫూర్తుల నొప్పెను. అట్లు కాక యొకవిధముగఁ బింకము మకిలఁ బెట్టుకొని మద్రాశాలైకగురుకులవాసులై యాంగ్లముగ్ధులై పాశ్చాత్యభావనామూర్తులై యొప్పు కొంద ఱాంధ్రమునకు నన్ని విషయములలో సంస్కారములఁ బ్రారంభించుచు నవత్వ మిచ్చుచున్నారు. ఆనవకళాప్రతిభాప్రకాశము తత్సహృదయైకహృదయంగమ మగునేమో కాని శాస్త్రీయసంప్రదాయాచారబద్ధముగ భారతీసమారాధకు లగువారికిఁ దలతిక్క గనే యున్నట్లు స్పష్టపడుచున్నది. క్రమముగఁ జెప్పెదను. ప్రకృత మారచనలఁ జూచుకొందము.

పద్యములను వ్రాయ మొదలిడి భాషాపరిచయకష్టమున యతులును ప్రాసములు నఱసున్నలు శకటరేఫములు, నేల యని వాదింపఁదొడఁగిరి. గ్రాంథిక మేల ? వ్యవహారమే ప్రయోగింపఁదగు ననిరి. గణము లేల ? మాత్రాగణములే చాలు ననిరి. సిలబి ల్పద్ధతి మంచి దనిరి. బ్లాంకువెర్సులే లెస్స యనిరి. భాషావిషయ మెట్లున్న నేమి? భావము విశాలముగ నుండవలయు ననిరి. అన్నింట స్వైరవిహారము చేయవలయు ననిరి.

ఆస్వైరవిహారపాటవము దుష్ఫలకమై యన్నింటఁ బొడమినను భాషావిషయమున నగతికత్వహేతువుచే నఖండవీరస్వైరవిహారము సాఁగుచున్నది. వాచ్యవాచక,వ్యంగ్యవ్యంజక,లక్ష్యలక్షకభావములు లేక వక్త్రధీనార్థకములుగాక శబ్దములు ప్రయోగింపఁబడుచున్నవి. చూడుఁడు.

"కన్నీటికెరటాల వెన్నె లేలా? నిట్టూర్పుగాడ్పులో నెత్తావి యేలా?"

ఏలా ? అనుచు సందేహడోలాశ్రయవిహారము చేయుటేలా ? ఎంతమహోగ్రదుఃఖమునందును సుఖలేశ మూహించి యాశాబద్ధుఁడగు నని బోధించుటకే కదా ! అగుఁ గాక. ఆవెన్నెలలు కెరటాలతో సహచరితములా ? ఈయాశయద్విషయకము- ఆనందబాష్పములు కాఁగూడదా ? కన్నీరు మున్నీరై కెరటాలుపుట్టెనా ? అగుచో దుఃఖభావమేకదా ? మరణశోకమా ? సామాన్యమా ? కాక యీర్ష్యావిష్టహృదయ యగు నొకనాయిక యేడ్పా ? ఈవిషయ మసంబద్ధముగ లేదా? దుఃఖసామాన్యసంబంధ మందురా ? విషాదమాత్రపర్యవసితములును గలవు. పునస్సమాగమరహితస్థితిని శోకించుభావము పూర్తిగ నున్ననే కరుణ మనఁబడును గదా? ఆకరుణరసమున వెన్నెల లేదే. వెన్నెలజిగిమిలమిలమను పొందికయే వర్ణ్య మనుకొందము. అప్పుడును వ్యక్తిసందిగ్ధమే. ఇఁక ధ్వన్యాశలమాట నెట్టవలసినదే. అయినను గానవిశేషము గలదని స్థానమువారిప్రభావమువలన ననవలసివచ్చు నందురేని నౌ నని యు గానలౌల్యము విలక్షణమై శాబ్దిపై నధిక మాధారపడియుండు నని యు నందుము. రచనాపరిపాటియుఁ జెడినది. కెరటాలకా- అని ద్వితీయ

ప్రథమచరణమునఁ గలదు. ఇతరమున "షష్ఠి"యుఁ గలదు.

నిట్టూర్పుగాడ్పులో నెత్తావి యేలా.

వెన్నెలవంటినిర్దిష్టవిశిష్టస్వరూప మీనెత్తావిలో లేదు. నెత్తావి యద్విధమో తెలియదు. 'గాడ్పు' పదము నిట్టూర్పు నతిశయింపఁజేయుటకా? నిశ్వాసప్రభంజనమును ఝంఝామారుత్తును జెప్పుటేమి? ఫెళఫెళార్భటులలో మెరపేలా? అనుచున్నారు. ఐకకాలికములా యానుపూర్వికములా? ఉరుములమెఱపుల యుల్లాసమా? పూర్వచరణమునం దున్నయధికరణకారకసామర్థ్య ముత్తరచరణంబుల లేదు. కెరటాల నధికరించి వెన్నెల యున్నట్లు ఫెళఫెళలయందు మెఱపుండదు. ఇట్లే కారకదౌర్బల్యము. క్రమక్రమముగఁ బ్రబల మయ్యెను. ఫెళఫెళలతో మెఱపనియా? అశనిపాతంబులో నంబు వేలా? పిడుగులో నీరేలా? అని యడుగుచున్నారు. పిడుగులో నీ రేమిటిది? హాలాహలములో నమృతమున్న దని యెందుఁగలదు? ఈ యేలపాటలోఁ గ్రొత్తఁదనము గాని భావవిస్తృతి గాని లేకుండుటే కాక భావవైకల్యము గలదు. మొదటి చరణమున నే భావమో యన్నింట నా భావమే కలదు. ఇట్లు తత్త్వాల ధోరణి కంత మాత్రనియిష్టమే. పాడిన సొంపును లేదు. మానిన వంపును లేదు. చీఁకటిలో మిణుకుచుక్కేలా? మండువేసవిలోను గండుకోయిలలేలా? వేఁపనూనె కంత వెగటుగుణ మేలా? వెఱ్ఱివాని కంత వైరాగ్యమేలా? ఉప్పుసంద్రములోన గొప్పరత్నము లేలా? ఉల్లోలకల్లోలకదనరంగోత్తాలభీకరాయుధ సంఘర్షణములో గెలుపులచ్చి యేలా? అని పాడి వినువచ్చును. కవిస్వభావనాభావుకదివ్యప్రపంచమున విహరించుచు గానము చేయుచున్నాఁ డన్నచోఁ దద్గానజాతివిశేషము సువ్యక్తము గావలయును. ఉదాహరణముగ నీక్రింద వ్రాయుదును. "కన్నీటికెరటాల ఆవెన్నెలేలా?" అని నిర్దేశించినచో విశిష్టత యుండెడిది.

గీ. నవ్యత యనారతంబు నానందదాయ
కముగదా జనతతికి రక్తాక్షినామ
నూత్నవత్సరమా రమ్ము... స్వాగతమ్ము
పీడవదలఁ బిశాచము పిల్చినట్లు
నీవు మాత్ర మంతకంటె నధికము గావు రక్తాక్షి...

ఏమి స్వాగతము. రక్తాక్షి పీడ తరువాతవచ్చినపిశాచ మఁట. ఈ పిశాచమునకు స్వాగత మేల? ఇది స్వాగతములో దురాగతము. ఆంగ్ల

లమర్యాద యట్టిదై యుండ నోపును. "Please" అనుపదమును జేర్చి యెంతకఠినముగనో పల్కనోడరు.

" Please, do not talk too much.
Please go out of my room
You act foolishly please."

ఈప్లీసుపదమున కేమైన శక్తి గలదా; అట్టిసంప్రదాయమున రచింపఁబడి యుండదా ? "ఆరక్తాక్షిస్వాగతము". ఇఁక రమణీయత యను నది విజ్ఞులే యరయవలయును. ఆరక్తాక్షిని వేఱొకరు రమణీయముగ "పాపాత్ము లగువారి పాలిరక్తాక్షి, భారతద్రోహులపాలి రక్తాక్షి, స్వమతధిక్కారులపాలి రక్తాక్షి," అని వినుతించి కవితాధోరణీవిలాసమును బ్రదర్శించిరి.

నాబాలకృష్ణుంకు నలు పైన నేమె
నాకాంతు ముద్దాడ నలు పంటునమ్మ.

అని కలదు. నలు పిష్టము మొదటిపాదములో- రెండవపాదములో నలు పనిష్టము, ఏమి రచన.

శబ్దించు నెద్దొ హృత్సరసీజమందు
జీవప్రసవమ్ము చిఱుగకమున్నె
మకరందఘుని రూపుమారకమున్నె.

శబ్దించు నెద్దొ యనఁగనే శ్రోతల కెట్లు స్ఫురించునో- పువ్వు చినుఁగుట యేజాతీయమొ- జీవప్రసవమ్ము చివుకకమున్నె యన్న నెట్లుండునో ? మకరందము మార్పెమొ ? పధ్వనియో; కలగూరగంప దిఁపుడుపాటు గాక కవితాపాటవమే యిట్టిది ; "అపరాధీనతాసూత్ర మూఁదె కలవు వెలుఁగుపెన్నిధులు" అని యొకకవి పల్కెను. పరాధీనత్వమునకు సూత్రారోపణ మేమి; తదంతర్గతము లై పెన్నిధు లుండుట యేమి; ఈసూత్రమునకును పెన్నిధికిని నాధారాధేయసంబంధ మెట్టిది ; ఆంగ్లములో "Principle" శబ్దము స్మృతికి రాఁగ దానియాంధ్రీకరణ మిది కాఁబోలును "మల్లికాసుమతారాప్రఫుల్లసురభికౌముదీదీప్తి, నొక రకమువారరసిరి. ఏమిదీప్తియో; అసమాసార్భాటములో నే మున్నదో;

గాన వక్షాంచలలసమద్వాంతగీతామృతాస్వాదనపరు లెట్లని రచింతు రని యెత్తింగి "సలాము" కొట్టవలసినదే.

సిరము పాదములతోఁ జేరిపోయినదాఁక
మోదంబుతో నిన్ను మ్రొక్కనిమ్ము
ఎలుఁగు గద్గదికతో నింకిపోయినదాఁకఁ
దెలివితో నిన్నుఁ బ్రార్థింపనిమ్ము-

అనన్యైకాంతికభక్తిరసమును బ్రవర్తింపఁ బైరీతి రచించిరి. ఏ రాంగ్లముగ్ధులుకాని నాంధ్రసంప్రదాయాభిరతి కలిగి లేనివా రగుట నొకవింతపోణిమితో రాణించు వీరికవితలో నసందర్భములు పెక్కు గలవు. సిరము పాదములతోఁ జేరిపోవుట యన నేమి; నమస్కరించువాఁడు వంగి వంగి క్రుంగి క్రుంగి తనశిరస్సు తనపాదములపైఁ బడునట్లు నమస్కారము సేయుట యెందేనిఁ గలదే. సాష్టాంగనమస్కారము పూర్వులు వర్ణించిరి కావున నష్టాంగనమస్కారమనికీనివర్ణించిరా; నడుమువిఱుగ నమస్కారమానిఖిలాంగకమ్ములు నినుఁ జేరునంతకు మోదంబుతో నిన్ను మ్రొక్కనిమ్ము, అనియో మోదంబుతో నిన్ను మ్రొక్కుకొందు, అనియో వ్రాసిన నెట్లుండునో కాని పాదాలతోఁ జేరిపోవుట యనుమర్యాద బాగుగ లేదు. ఎలుఁగు గద్గదికలో నింకిపోవుట రసవత్తరముగ నుండును.

"నీనాట్యమ్ములు నామనఃస్థలిని కానిమ్ము నీగానలీ
లానైర్మల్యమనోహరశ్రుతులు గాల్వల్గట్టి నాకంఠమం
దే నిండఁగనదింపు మోయి మధుమూర్తీ నీకటాక్షద్యుతుల్
రానిమ్మోయి మదీయజీవితతమిస్రద్వారముం జీల్చుచున్".

ఓయి మధుమూర్తీ రానిమ్మోయి నీకటాక్షకాంతులు. అని యెంత యవినయముగ నడుగుచున్నాఁడో; గూనలో బియ్యము రాగిచెంబులో వేయవోయి ఓయి వేలవాఁడా, అన్నట్లు నీటు, ఠీవి, చెక్కు, కప్పుటుచున్నది కాని భక్తి లేశమును లేదు. "ఓయి" కవిత్వకళ యిప్పు డందఱును బ్రదర్శించుచున్నారు. పోయియు "ఓయి" వంటియగ్రస్థానమునే పొందెను. చెప్పుకుపోయి, చేరిపోయి, తన్నుకుపోయి, తప్పిపోయి, పెక్కు లుపయుక్తము లగుచున్నవి. నవ్యసాహిత్యములో "ఓయి" మ

హాస్యశక్తియై తాండవించుచున్నది. పోనిండు. ఆమధురమూర్తికి సేయే యాజ్ఞలు చేసిరో వింటము. ఓయి మధుమూర్తీ; నీనాట్యమ్ములు కానిమ్ము. రంగస్థలము కావలయునా; నామనస్స్థలము గలదులే అదు......... ఇంక గానము చేసి శ్రుతులు నాకంఠములో ధ్వనింపుము. నాజీవితతమి శ్రద్వారమును జీల్చుచుఁ బొమ్ము.........ఏమిధ్వనియో! తనయందు దేవుఁడు నిత్యము నుండవలయు నని యాజ్ఞాపించుచున్నాఁడు. గొప్పభక్తుఁడు. ప్రవృత్తి కుదిరినది. నాట్యమాడు మని యనుచున్నాఁడు. కాని స్థలము నుచితము గావింపలేదు. భగవంతుఁడు నటకుఁడే యైన రంగస్థలము వలదా? అస్థసంపద లేని వా రేమిచేయఁగలరు. రంగనిర్మాణము చేయనేరక మనఃస్థలినే యాడఁ జూపిరి. పాటలశ్రుతులఁ గంఠమందుఁ గావింపవలయు నన్నారు. గానలీలానైర్మల్యమనోహరశ్రుతులు కాల్వలట్టుట యేమొ వింతగ నున్నది. తాల్వాదిస్థానము లుచ్చారణాధారములై యుండఁ గంఠమునందే నిండ నదింపవలయు ననుట యేమి ; కాల్వగట్టి నిండి నదించుట యేమివర్ణనము; కటాక్షద్యుతులు ద్వారమును జీల్చుటయేమి; గుమ్మములు పొడిచి తలుపులు తెఱచిన తస్కరులయుట్లీపనియేలా; కవాటము లని లక్షణార్థమా; కడపటికిఁ బొమ్మని శాసించుట యేల; ఏమిభక్తిరసమో!

మనస్సాగరము తాండవవిశారదత వహియించు నని యొకకవి యనుచున్నాఁడు. సాగరముదు దత్తాండవమును నభినవకలాప్రతిభ యై యుండునో;

“రక్తిఁ బల్లవనికరమ్ము రమ్మని జీరు
నధరమ్ముపై మందహాసరుచులు”

ఇత్యాదిగ హరితుఁడుకవిగారు వ్రాసిరి. గుప్తనాములై భాగ్యదేవతారాధనావర్ణనము గావించిరి. దేవతలను వర్ణించుపట్టునఁ బాదాదిగ నుండవలయు ననుట భారతసంప్రదాయ మని యెఱుంగరో యెఱింగియు సంస్కరించిరో; పోనిండు. మ దహాసరుచు లెఱ్ఱగా నున్నపెదవిపైఁ దళ్కొత్తె నని వర్ణించుటలో ‘రక్తి-పల్లవ’ శబ్దము లశ్లీలార్థకము లగుచున్నవి. “రక్తి” శబ్దసంయోగము పల్లవశబ్దనానార్థాన్యతమవిటపదార్థావబోధనాజ్ఞాపకముగ నున్నది. “జీరు” నరళాదేశ మేదేశమో.

యౌవనోత్తాలోర్మి లల్లన నంతకంతకు నణఁగుచున్నది
మందరమ్ముగ దరియుచున్నది మరణ యామవతి—

ఈరచయితలు తమలో నుబ్బిపోవు సాహిత్యవేత్తలు. భాషావైదుష్యమును జూపఁదలఁచి పదముల యోజన మనుచితముగఁ జేయుచు నధికపదముల నల్పభావమును బ్రదర్శింతురు. కథకులై యేదియో వ్రాయుదురు. యౌవనానంతరభావి మరణమని నియతమైనదా; మరణ యామవతి దరియుచున్న దని యధీరహృదయమును బ్రదర్శించుచున్నారు. "అల్లన నంతకంతకుగా గడబిడమాటల కవితగాదా; "మరణ యామవతి" స్త్రీత్వము యముద్దిష్టమో; స్వారస్యము రసికతలేక యేదో యాడంబరముగ వ్రాయుదురు.

"పాదంబు కడుపులో బ్రహ్మాండమెల్ల
నింపను మంజీరనినదంబుతోడ,
నెమిలిపింఛము భవ న్నీలాంశుకమున
బంగారుశాలువు బాహుయుగ్మమున
వెన్నెకా దాలాటి స్విన్నమానసము,
మధురలోఁ బారులే మరపింపలేక.
పీవృతంబుసేయు, తద్విశ్వరూపంబు, ...
"బాహుబలమున సంతరించుచు నుంటి" దీని కంత మెన్నఁటికో—
ఎవ్వరు కాతరిల్లెదరు, ఏమి నీకరుణాకటాక్షము స్వామి ధన్యోహం."

శబ్దాడంబరమాత్రభావశోభితస్వరూపమునకుఁ బైనుదాహరించినవి చాలును. పాదంబు కడుపులో మంజీరనినదముతో బ్రహ్మాండము నింపుట యేమిసంబంధమో యెఱుకపడదు. మంజీరధ్వని బ్రహ్మాండసమాకర్షక మనియా? తనయుదరముననే లోకము లున్నవని యొద అనుట విని విసివి పాదగర్భములోఁ బెట్టిరా? ఇది వైదికమని యందురా? "పాదంబు కడుపు" ఏమియోజనము! గర్భాలయ మన్నదానిని 'కడుపుటిల్లు', చేసిన ట్లుండును.

భవన్నీలాంశుకమున నెమిలిపింఛ మున్న దన్నఘటము దుర్ఘటముగనున్నది. బాహుయుగ్మమున శాలువవేసికొనెనఁట, క్రాపింగు, ఫ్రెం

చికట్లింగులు, కారాకిల్లీ, క్రమక్రమముగవర్ణింపఁబడు నేమో? ఏమిచేయ
దు. చిత్రము లన్నియు నిప్పుడు మరణదుఃఖానుభవసమయమునం దట్లు
జుట్లు విరియఁబోసికొనియే యుండును లెండు. నటకులును దానినే య
నుకరించుచున్నారు. కావునఁ గృష్ణునివేషము సంస్కరింపరా? నీలవర్ణ
ము, శిఖిపింఛము, మురళి, యింకను గొన్నిదినము లుంతురో త్రుంతురో
సంస్కర్తృలదేకాధారాధీనము.

వెన్న కాదు, ఆలాటిస్వేచ్ఛమానసము. వెన్న కాదు. అది వెన్న
వంటి స్నిగ్ధమానస మను తాత్పర్యము సంగ్రహించి సందేహసంపుటము
నుగావించిరి. ఆలాటి యేపెద్దలాటియో? "స్వేచ్ఛ" పద మేలదొర్లి పడినదా?

"మధురలోఁ బౌరు లేమరపింపలేరు" పౌరుల నేమఱపింపలేదని
యా యీప్రేరణము పాదపూరణమా? నీవృతపదము వివృతరూపాంత
రమా? అహా రీతిసారళ్య మెంతలెస్సగ నున్నది? నిరంకుశు లరంకుశమ్ము
పాటింతురా? ఈఁదుచున్నా ననుటకు సంతరించుచున్నా నని ప్రయో
గించిరి, సరళమే; కాతరిల్లెదరు భయపడెద రని యర్థము. ఇంచాలు నిల్లు
లుభావకవులప్రపంచములోఁ బెచ్చుపెరిఁగిపోవుచున్నవి. "స్వామిధన్యో
హం" అనుకరణము లేదు. దండకములయంతమున "నమస్తేనమః"
అని యున్నది కావున "ధన్యోహం" అని నిరనుకరణముగ రచించిరా?
చిత్రము?

ఇట్లే నీరచనములు సందిగ్ధములుగను ననుచితములుగను నుం
డును. ఆవర్త మనుపేరితో నొకపెద్దసుడిగుండములో నొకభక్తుని నాత్మ
హత్య గావించుకొనుటకు దింపి చంపిరి. ఏమివస్తువు?

రాధపిలుపని వ్రాయుచుఁ గృష్ణుఁ డాపుష్పమున లేఁడనియు నం
తట నున్నాఁడనియు నెక్కడలేఁ డనియు నేమేమొ యవకతవకగ బో
ధించిరి. శీర్షనామ మొకవిధము, శరీరలక్షణ మిం కొకవిధముగను బూ
ర్వోత్తరసందర్భవిరుద్ధముగను జెప్పుటలో దిట్టలగుచున్నారు. నీదిథోర
ణి యన్నింట నిట్లే యననుబంధముగ నుండును.

"వేదనాదంబుతోఁ దేటివిప్రుఁ డెగిరి
చిన్నిజిలుగులరెక్కలచేతు లెత్తి
మేలిదీవెన లిడె నాత్మమిథునమునకు.-"

ఇందలి నూత్నమిథున మెంతవింతగ నున్నదో కనుఁడు. ఆవిప్రుఁ డగిరి చేతులెత్తి దీవించెనఁట. అంతట రూపకము గలదా? ప్రణయ దేవత పొంగి ముగ్గులు పెట్టెనఁట. దేవత కుత్సాహము కలిగిన ముగ్గులు పెట్టునా?

“గాలిమొలకల చాలు రేగెను కలికి కేవల పిష్టమో?”

మొలకగాలులు రేఁగినవఁట. కలికికి ఏవలపిష్టమో? అని యను చున్నారు. విషయము నీడ, యనియు విని గమము, ఏవల పనియు నను చితముగ వ్రాయుటయే కాక “కలికి—కేవల పిష్టమో” అని పిండి ముద్దను గూర్చి మార్చిరి. ఆహా! ఏమిరచనము!

గీ. ఏది నీ కక్షపెట్టిన దాదిచూపు, చిత్తముండనిమాటల యుత్తముండ
సొంపు గులుకనిపద్యంబు కంపదేల, సరస వాచానిరూఢ ప్రశస్త చరిత.

ఇత్యాదిపద్యంబుల యం దళ్లిల మున్నట్లు “కేవలపిష్టము” లోఁ బిండిముద్ద లేదా? ఇది పిష్టకష్టరీతి యనుకొందము.

“ఆకులో ఆకునై - పూవులో పూవునై
కొమ్మలో కొమ్మనై - నునులేత రెమ్మనై
ఈయడవి ఎట్లైన - దాగిపోనా ఇచటనే - ఆగిపోనా”

అడవిలో దాఁగుటకో నాఁగుటకో శంకించు భారము. ఆకులోఁ దానొక యాకగుట యనఁగ నాకగుట యనియా? “లో” షష్ఠియా సప్తమియా? ఆకులలో నొకయాకగుటయా నాకునం దాకగుటయా? అర్థవిచారము చేసిన భావపుష్టి నశించిపోవును. ఆకులో నాకుఁ బువులోఁ బువ్వు నగుధోరణి మాటి “నునులేత రెమ్మ” యగుట యేమొ; రెమ్మలో రెమ్మ యున్న రసభంగ మనియా?

“గలగలని వీచు చిఱుగాలిలో కెరటమై
ఈకరణి వెఱ్ఱినై యేకతమ తిరుగాడ.”

ఏకాంతసుఖ మనుశీర్షము క్రింద వ్రాయఁ దలఁచి పర్యవసాన ముగ వెఱ్ఱి యగుట సుఖాత్యంతికభావవిశేషముగ రచించిరి. ఉన్మాద మని మొఱుక యగుచో విషాదము సంభవించును. గాలిలో కెరట

మగుట నాంగ్లభావ మనుకొందును. ... ... వేదాంతార్థసౌందర్య మం దున్నదని వ్యాఖ్యానించుచో నేమన్నను వేదాంతములో దిగవచ్చును.

ఈధోరణిలో నెంతయో వ్రాసి వేదాంతార్థము చెప్పవచ్చును. ఇంతేల, బూతాడి పుణ్యార్థమును జెప్పవచ్చును. ఇట్టిరచనములా భావుకములగుచున్నవి; కీటుమూడులతి ధీరచిత్తుఁడు దేవదేవునిఁ గాపాడుమని వేఁడఁదగునే యని యొకకవిగారు శంకించుచున్నారు. మాంపాహి యన రాఁదట. ... ...

"సరసరసాలనూతన కిసాలయభోజనమారగించి సుందరతరమల్లికాకుసుమదామము లస్నకరందనిర్ఝరాంతరములఁదానమాడుచు లతాచయడోలల నూఁగుచున్ — కూయుచున్నదఁట. ఏమిభావసౌందర్యమో? కోకిలభోజనముచేసి స్నానమాడుచు నుయ్యెలలూఁగుచుఁ గూయుచున్నదఁట. ఏమిసంప్రదాయమో? పంచమస్వరసార్థక్యమునకా భోజనాదిక్రమము? కుసుమధామములలో నిర్ఝరముల నీకవిగారు సృష్టించిరి. ... ...

ఆంగ్లములో సొంపైననాంధ్రములో సొంపగునా? ఏమితర్కము? నేఁడించుమించుగఁ గవివరు లాంగ్లముగుర్లే కాని కేవలాంధ్రులు మననవనాగరకదృష్టిలోఁ గానేరరు వారిరచనలే ప్రచారార్హములు. ప్రచారకులును దత్సహృదయు లగుచున్నారు. ఇంతయేల? ఆంధ్రాదివార్తాపత్త్రికలయు భారత్యాదిమాసపత్త్రికలయు నధిపతు లరయ నరయ నాంగ్లమాత్రాభీప్సాపరిపాకచిత్తులన్నఁ గినియ రనుకొందును.

దేశము:- తనదేశమును దన్నామమును నాంగ్లప్రతికృతిగఁ జేయుఁదలంపే మెండయ్యెను. సాలూరు "సాలూర్" - విశాఖపట్టనము - "వైజాగపటమ్" ఇత్యాదిహాలంతనామకరణాభిరుచి హెచ్చుచున్నది. గృహసౌధాదికము లింగ్లీషువారిమాదిరివే యని యుండ తెలుపుగుదురు. దేవగృహ మనుమాట లేకపోవుటయే కాక దేవస్థాన మని ప్రత్యేకనిర్మాణ మొందును గానము.

కాలము:- కాలమును తద్విభాగమును నాంగ్లేకహృద్యమై యున్నది. జాములు గడియలుఁ జచ్చినవి. గంటలును, ఎ. యమ్. పి. యమ్. A. M., P. M, విభాగములు ను వ్యవహారరమణీయము లయ్యెను. కాలవిభాగమును తత్పవిత్రత్వమును నడుగంటెను. 'ఇక్ష్వాకులై యెంత, 'ఇక్ష్వాకు కాలమె రి" ఈరెండువాక్యములును భిన్నతాత్పర్యకములై యున్నవి. యామ మన్నచో నామమే యగును. అయినను జాముకోళ్లును జాముపట్టుటలు ను నింకను దేశమున నున్నవి. సాధారణాహారపరిణామము యామము. ఏకకార్యావిరతనిష్ఠ యామావధికము. ఇట్లే యామవిశేషము జీవితమున సన్నిహితసంబంధముతోనున్నది. అవ్యవహారసార్థక్య మిక్ష్వా డెంమను లేదు......

ఈమార్పును సంస్కరింపకున్న నెంతయో ప్రమాదమున్నది. స్వార్థత్యాగము గావించి యాయాంగ్లసంస్కృతులు తమ యాంధ్రత్వమును బరిస్ఫుటము గావింపవలయును. మార్పు నాఁడఁ గలమా; అని యనరాదు. మాఱుదానినే సంస్కరించుట సాధ్యము.

అంకను సాహిత్య మత్యంతసంస్కార్యము. సాహిత్యములో మానవునిబహిరంతఃస్వరూపైక్యస్వరూపము గలదు. దానిఁ బవిత్రము చేయవలయును. సాహిత్య మనశ్శుద్ధి లేకున్నచో సాహిత్యఫలము దూరమగును. నేఁడు నవ్యసాహిత్య మని యొకయుద్యమము పుట్టి స్వేచ్ఛాగానములో మునుఁగుచుఁ దేలుచున్నది. కాని నిర్వృతిప్రాప్తి యెట్లుండునో!......గ్రంథనామకరణమునం దంతగా నియమమును బాటింపరు. ఆర్యగ్రంథము లగుచో 'రామాయణ మనియో, రామచరిత్ర మనియో, బుద్ధచరిత్ర మనియో' యధికృతార్థ మందుండినట్లుచూతురు. బుద్ధుఁడు, శైవ్య, కర్మము, ప్రవాహము, ననుచు నార్యసంప్రదాయజ్ఞులు ప్రా-యరు. శకుంతల, యని కావ్య ముండదు. శాకుంతల మనియో శకుంతలాదుష్యంత మనియో యుండును. కాని యసంప్రదాయవర్గ నాశ్యలు వ్రాయరు.

కర్ణధర్మరాజవృత్తము.

II

కీ. శే. తా. లక్ష్మీనరసింహారావుపంతులుగారు,

ఓహో! చూచితిరా కర్ణునిసద్వృత్తము. అవతారపురుషుఁడైనకృష్ణు ననుసరించి మహానుభావు లనేకులు మహావరంబులు వడసి కుబేరు లైరి. సాత్యకియును భోజులును కుకురులును వైద్యాంధకులును వార్ష్ణేయులును సృంజయులును కృష్ణుని పరమయుక్తంబయిన బుద్ధి నాశ్రయించి యరులం బోకార్చి మిత్రసంఘములకు సంతోషము నిచ్చిన వారైరి. మఱియు నుగ్రసేనుఁడును సర్వవృష్ణ్యంధకులును యాదవులును మనస్వులగుచుఁ బరాక్రమమున వెలుఁగొందుచు సత్యపరాయణత్వమున నుండఁ గల్గి దేవేంద్రుతో నెనయై భోగము లందినవారైరి. క్రూరుండైన జరాసంధుని వధియింపించి వానిచే బల్యర్థమై వధింపఁబడుటకుఁ జెఱలో నుంచఁబడిన రాజుల నెల్ల విడిపించి దయాసముద్రుండై మంగళస్నానంబులు సేయించి భోజనతాంబూలంబులం బరితృప్తులం జేసి రథాశ్వసామజాధిరూఢులం గావించి నిజరాజ్యంబులకుఁ బూజ్యులం జేసి పంపినవాఁడుగదా! ఇవిగాక కృష్ణుని యమానుషకృత్యంబులు:—తన గురువైన సాందీపని పుత్రు నెన్నఁడో చచ్చినవానిని బ్రదికించి గురుదక్షిణగా నిచ్చుట లోనుగాఁగల యత్యద్భుతంబులైనవిగలవుగదా! ఈమహానుభావుని మాహాత్మ్యంబును నౌదార్యాదిసుగుణంబులును వర్ణింప నెవరితరము? అట్టి మహాపురుషుఁడు ప్రసన్నుఁడై పృథివీరాజ్యము నీకిచ్చెద నన్నఁ గర్ణుఁ డపేక్షింపఁ డయ్యెను. ఇందుఁ గర్ణునిస్వార్థపరిత్యాగము వర్ణనీయ మయినదిగదా!

మ. జలజాతప్రభవాదులున్ మనములోఁ జర్చింప నశ్రాంతమున్
"బలుకన్ లేని జనార్దనాహ్వయపరబ్రహ్మంబు."

అని బ్రహ్మపుత్రుఁడైననారదునిచే వర్ణింపఁబడ్డ శ్రీకృష్ణుండు నీకు సమస్తరాజ్యం బొసంగెదను, నేను నీపరివారజనంబులలో నుండు

వాఁడ వని తనకుఁ దానై మృదుమధురంబుగఁ బ్రేమపూర్వకంబుగఁ బలుకనెవ్వఁ డైన నొల్లకుండునా ? కర్ణుని యొల్లకునికి యాతని యాత్మత్యాగితఁ బ్రకటించుచున్నది. మఱియుఁ దాను సూతవంశజు లైన తనపెంపుడుతలిదండ్రు లగు రాధాధిరథులను విడనాడ ననుటయు వారికి స్వర్గసుఖము కొఱకు వేయవలయు పిండంబులు పడఁగొట్టఁ గడఁగఁ దగ దనుటచేఁ బితృభక్తిఁ గలవాఁ డనియుఁ బ్రకటించుచున్నది. యీవిషయమై కృష్ణుని మంత్రంబు విన ననుటలోఁ గృష్ణునియం దెంతభక్తి చూపినవాఁడో చూడుఁడు.

గీ. ధర్మవిదుఁడును సతతంబు ధర్మశాస్త్ర
ముల శ్రవణమందు రతుఁడౌచుఁ బొలుచుచుండు
వాఁడు నైనట్టి మనఁబోటి వాఁడె యల్ల
కాంత పిండంబు పడఁగొట్టఁ గడఁగ నగునె.

అని తన్నుఁ గూడఁ గలిపికొని కృష్ణునియం దెంతగౌరవ ముంచి చెప్పినవాఁడో చూడుఁడు.

మఱియు ద్రౌపది నిన్నాఱవయవసరమునఁ గలయు నని కృష్ణుఁడు చెప్పినదాని కొల్లమి కర్ణుని యుత్తమత వెల్లడించుచున్నది.

ఇందుఁ గర్ణుఁడు ధర్మరాజుకంటె ను శ్రీకృష్ణ పౌత్రుఁడైన యనిరుద్ధునికంటెను విశిష్టుఁ డని ప్రకటన మగుచున్నది. ఏమిటికంటేఁ దన తమ్ముఁడైన యర్జునుఁ డనన్యసామాన్య ధనుర్విద్యాసామర్థ్యంబుచే భార్యగా సంపాదించికొన్న ద్రౌపదిని మాతృవాక్యపరిపాలన మనుమిషచే సిగ్గులేక ధర్మరాజు తనకుఁ గూడ నుమ్మడిభార్యగాఁ గామించి గ్రహించెను. అనిరుద్ధుఁడు ద్వారకాపట్టణములో నిజసౌధంబున నిద్రపోవుచుండు సమయంబునఁ జిత్రరేఖ తిరస్కరిణీవిద్యచే నంతు ప్రవేశించి బాణాసురుని కూఁతు రుషాకన్యకు నిన్నుఁ గూడినట్లు స్వప్నము వచ్చిన దని చెప్పి దానియొద్దకు నిన్నుఁ గొంపోయెద నని నుడువుట తడవుగఁ జిత్రరేఖ ముక్కును మొగమును దా నెన్నండు నెఱుంగనివాఁ డైనను వెకలియై తోడనె యంగీకరించి యానిమిషమందే యనిరుద్ధుఁడు తనభార్య ను విడనాడి యద్దమరేయి చిత్రరేఖతో బాణాసురుని పురికిఁ బోయి యుషాకన్యను దానిసౌధంబున రహస్యంబుగఁ బరిగ్రహించె.

కర్ణునిభృత్యత్వము:—

కర్ణుఁడు దుర్యోధనునకు భృత్యవర్గములోనివాఁడు. సామంత రాజు; సచివుఁడు; భృత్యత్వములో నున్నను శ్రీకృష్ణుఁ డిచ్చెద నన్నమహా రాజ్యపదవి నొల్లమిచే లోకమునం గలభృత్యులలో నెల్ల నితఁ డగ్ర గణ్యుఁ డని ప్రకటించుచున్నది. అతఁడు శ్రీకృష్ణునిమంత్ర మనుసరించి తోడనె పోయి మహారాజ్యపదవి గైకొనెనే నేని వానిని దుర్యోధనుఁ డేమిచేయఁగలఁడు? అప్పుడు కర్ణునకు వాఁడు భృత్యుఁడు కావలయు వాఁడేకదా? ఓహో యేమి యీకర్ణుని బుద్ధి! మఱియుఁ గర్ణునిసత్య ధారిత:—

"అనయము చావువచ్చిను" అని పయిని జెప్పిన పద్యమువలనఁ గర్ణునిఁ సత్యధారిత స్పష్టమగుచున్నది ఈవిషయమ్మున ధర్మరాజు కర్ణునిఁ బోలఁగలఁడా? ధర్మరాజు నీ వెప్పుడు వధ్యుఁడ వగు దని తా నడిగిన పిమ్మట శ్రుతికఠినమును దుఃఖకరమును నగువార్త విన్నప్పుడు తాను యుద్ధముఁ జేయక శాంతి నొందెదనని ద్రోణాచార్యుఁడు చెప్పి యునికిచే "అశ్వత్థామాహత" యని పెద్దయెలుఁగునఁ గేకవేసి యనృతము పల్కి ధర్మరాజు తనగురువైన ద్రోణాచార్యుని మరణమునకుఁ గారకుఁ డయ్యె ను. రాజ్యప్రాప్తికై యనృతము పల్కి గురుద్రోహము చేసెను. కర్ణుఁడు బ్రాహ్మణుండ నని బొంకి పరశురామునియొద్ద శస్త్రవిద్య నేర్చె ననియును, దానిచే వానిసత్యము చెడిన దనియును గొందఱందురు. అది పొర పాటు. శస్త్రవిద్యాదానమునకు బ్రహ్మక్షత్రియులు తప్ప నితరు లేమా త్రము పాత్రులు కారని పరశురాముని నియమము. ఇందు, కర్ణుఁడు ధర్మరాజాదులవలెనే క్షత్రియుఁడు కాని హీనకులుఁడు గాఁడు. బ్రాహ్మ ణుఁడు కాక బ్రాహ్మణుండ నని చెప్పినంతమాత్రమున శస్త్రవిద్యాపరి గ్రహమునకు వాఁడు పాత్రభూతుఁడు కాకపోఁడు. కుంతీపుత్రుఁడ నని వాని కెఱుక లేనియంతమాత్రమున వాని కుంతీపుత్రత్వము చెడలేదు. వాఁడు క్షత్రియుఁడు కాకపోలేదు. వాని బొంకు పేరికి బొంకు గాని నిజముచేత బొంకు కాదు. అజ్ఞానముచే బొంకి వాఁడు సంపాదించినది జ్ఞానముచేఁ దాను బొంకక నిజమాడెనేని సంపాదింపఁగల్గిన శస్త్రవిద్యా

భ్యాసమే గాని యన్యము కాదు. ధర్మరాజు బొంకు గురుపుత్రుఁడైన యశ్వత్థామ తనయెఱుకను జీవించియుండఁగనే వాఁడు చచ్చినవాఁడని పెద్దయెలుఁగున బుద్ధిపూర్వకముగఁ బలికి గురుహత్యా పాపమును నసుఖమునకుఁ గారణమైన పార్థివత్వమును సంపాదించెను. కర్ణునిబొంకుపేక్షింపఁదగి యున్నది. ధర్మజునిబొంకు క్షమింప నర్హముగాని పాపకృత్యమై యున్నది. ఆబొంకుచే ధర్మరాజు వ్యాసమతమునుబట్టి తనవృత్తిపోవునని భయపడి బొంకు మనుజాధముఁడును దనప్రాణము పోవునని భయపడిబొంకు మనుజమధ్యముఁడును నైనవాఁడు.

కర్ణుని పితృభక్తివిషయమై యొక్కటి చెప్పెద:—

వ్యాసమహాముని ధర్మములు చెప్పుచో "ఉపకారము గని తరువాత నుపకారిని లక్ష్యపెట్టనివారి"లోఁ బెండ్లియాడి తల్లి నలక్ష్యము చేయు కొడుకు నొకనిఁ బేర్కొన్నవాఁడు. ప్రజాగరపర్వములో- అధ్యా 33-శ్లో ౬౨-౬3. వానికి నా తెలుఁగుపద్యములు.

క. కర ముపకృతి గని యార్గురు
తరువాతను లెక్కగొనరు ధర నుపకారిన్
సరి విద్యనేర్చి శిష్యుఁడు
గురువును, బెండ్లాడి తల్లిఁ గొడుకును మఱియున్.

క. కామము తీఱినపతి పెం
డ్లాముఁ గృతార్థుండు సాధనమయిన వాఁడే
డా మనుజు నేఱు దాఁటిన
యామనుజుఁడు నావ రోసి యక్కట వెజ్జన్.

ఇక్కడ రాధ తన్నుఁ గన్నతల్లి కాక పెంపుడుతల్లి యైనను క్షత్రియజాతిస్త్రీ కాకున్నను సూతజాతిలోనిది యైనను దన్నుఁ బెంచినంతమాత్రమున దాను రాజ్యపదవీ గరిమంబున నున్నవాఁడైనను దానియెడ నెంతభక్తి చూపినవాఁడో చూడుఁడు. తన్నుఁ గన్నమహారాజన్య యైనకుంతి తనకు రాజ్యము రప్పించుట కెన్నిశ్రమలు పడ్డదో యవి యించుకయినఁ గృతజ్ఞతచే నాలోచింపక రాజ్యప్రాప్తి యైనపిమ్మట నెంత యనాదరణ మాయమ్మయెడ ధర్మరాజు చూపినవాఁడో చూడుఁ

డు. యుద్ధానంతరంబ తిలోదకములు విడువ వలసినప్పుడు మున్నుగా నీయన్నయైన కర్ణునకుదకము విడువు మని తల్లి చెప్పుటయు యుధిష్ఠిరుఁ డత్యంతకుపితుండై యయ్యమనే గాక లోకములోని స్త్రీల నందఱను శపించినవాఁడు. ఆఁడువారియొద్ద రహస్యము దాఁగఁగూడ దనియుఁ గుంతి చండాలురచేతఁ బూజవడయుఁ గాక యనియును శపించినవాఁడు. కర్ణుఁడు తన కన్న యని యుద్ధమునకుఁ బూర్వము కుంతి చెప్పియుండెనేని ధర్మరాజు యుద్ధము చేయఁడు. వానికి రాజ్యము రాదు. మఱియు వాఁడు జీవనోపాధిగ వృష్ణ్యంధకరాజ్యములలో నింటింటఁ దిరుగుచు బిచ్చమెత్తికొనవలయువాఁ డగును. ఇట్టి దురవస్థఁ బొందకుండఁ దన్నుఁ గాపాడిన తల్లికి ధర్మరాజు తాను జేయవలసినపూజ యిదియా! అకటా యాతఁడు తల్లియెడ నెంతకృతఘ్నుఁడు! ఏఱుదాఁటి తెప్ప తగులఁబెట్టినవాఁ డయ్యెను. తనయన్నను వధించినదానికిఁ దనకు నిశ్చయముగఁ బరితాపము గల్గెనేని తనకు రాజ్య మక్కఱలే దనియు వనవాసి నయ్యెద ననియు బుడిబుడిదుఃఖములతో ననేకపర్యాయములు చెప్పిచెప్పి మహానుభావుఁడైన శ్రీకృష్ణునిచే మాటిమాటి కుపశమనవాక్యములు వడయనేల? వానికి దుఃఖోపశమనము గల్గఁజేయుటలో నాదేవదేవుఁడు చూపిన మహాశాంత మత్యద్భుతమైనది. నేనే కృష్ణుని యవస్థలో నున్నయెడ నేను విసివివిసివి యడవికిఁ బొమ్మని ధర్మజునితోఁ జెప్పువాఁడ నగుదును. ఆజగన్నాథుని శాంతముఁ జూడ భక్తులయం దాభక్తవత్సలునకుఁ గలయపారప్రేమ సూచించుచున్నది.

ఇంకఁ గర్ణునిదయాళుత్వవిషయమై యించుక చెప్పి గ్రంథవిస్తరభీతిచే విరమించుచున్నాను.

విదురుఁడు కుంతియొద్దకుం బోయి ధృతరాష్ట్రుఁడు సంధి కొడంబడమింజేసి యుద్ధ మగు ననియు యుద్ధములో మహావీరనాశన మగు ననియుఁ జెప్పి శోకించుటయుఁ గుంతి మనస్సులోఁ గళవళపడి యిట్లు చింతించెను.

దేనిఁ బొందుటకయి మహాజ్ఞాతివధము సేయవలయునో యల్ల లక్ష్మి కాల్పనా యేమి? కయ్యంబులో సకలబంధురాజికి ఘనపరాభవం

బగును. పాండవులును జైద్యులును బాంచాలురును యాదవులును గలసి భరతకులులతోఁ గయ్య మాడవలయును. ఇంతకంటె దుఃఖ మేది గలదు? యుద్ధ మాడినఁ బాపము సంభవించును. యుద్ధ మాడకున్న మాకుఁ గూడు లేదు. భూమిలోఁ జావుకంటె లేమి మిగులఁ గష్టంబు. జ్ఞాతివధము సేత జయము కాదు. ఇది తలంచికొనఁగ నాకు దుఃఖ మెచ్చుచున్నది. భీష్ముఁడును ద్రోణుఁడును గర్ణుఁడు ను గౌరవులప ట్టయిరి. దీనిచే నాకు బెంగ పెరుఁగఁజొచ్చెను. ద్రోణుఁడు గురు వగుటచే శిష్యకోటితోఁ బోరఁ బోఁడు. పాండుసూనులమీఁదఁ బితామహుఁడు పక్షపాతము దాల్పఁగలఁడు. ఇంకఁ గర్ణుఁ డొకఁ డున్నవాఁడు. వానిదృష్టి యిందు వంచితం బయ్యెను. వాఁడు దుర్యోధనుని మోహమునఁ బడి పోవువాఁడు. పాండవులతోడఁ బగ గొనుపాపి యాదు వారి కనర్థకరములగు పనులు సేయుమూర్ఖుఁడు. బలవంతుఁడు. ఇది యొక్కటియే నన్నిపుడు దహించుచున్నది. వానిని బ్రసన్నునిఁ జేయుటకు నేను వానికడ కేగి వాస్తవంబు దెల్పెదను. వానిమనస్సును బాండవపక్షమునఁ ద్రిప్ప యత్నంబుఁ జేసెదను. కన్నెనాఁటను దండ్రియింట నున్న నేను సలిపినపరిచర్యకు సంతసించి భగవంతుఁడైన దుర్వాసుఁడు దేవతాహ్వానమంత్ర మొకటి నా కిచ్చినవాఁడు. దానిఁ దలంచి మ్రొక్కి మంత్రము పఠించి కౌతూహలమునను నజ్ఞానమునను సూర్యు నాహ్వానమాచరింప సాక్షాత్కరించి యాతఁ డిచ్చినకానీనుఁడైన నాకొడుకు కొడుకుగ రక్షింపఁబడినవాఁడు. భ్రాతలకు హితంబుగను బథ్యముగను నేను జెప్పిన మాటఁ గర్ణుఁ డేలవినఁడు?

అని యిట్టాలోచనచేసి యుత్తమ మైననిశ్చయమ్ము చేసినదై ప్రయోజనము మనస్సున నిలిపినదై కుంతి భాగీరథికిఁ బోయెను. పోయి సత్యరతుఁడును దయాళువు నైనకొడుకు కర్ణుని వేదాధ్యయననిస్వనమ్ము కర్ణపర్వంబుగ విని ప్రాఙ్ముఖుండును నూర్ధ్వబాహుండు ను నైన యతని వెనుక నిల్చుండి యతివినమ్ర యై కార్యార్థ మతనిజప్యావసాన మొయ్యనఁ బ్రతీక్షించుచుండెను.

గీ. వేఁడివెలుఁగువేఁడి వెన్నునకుం దాఁకు
దాఁక జపముఁ జేసి తద్యతవ్ర
తుండు వెనుక దిరిగి తోయజాస్యను గుంతిఁ
గాంచి విస్మయమ్ము గదిరి మదిని.

భక్తిపూర్వకంబుగ న్యాయ్య మగురీతి నభివాదనంబు చేసి యంజలిఘటించి ప్రణతుఁడై యి ట్లనియె:—

రాధకు నధిరథునకును గొడుకను నీకు నమస్కారమ్ము చేయుచున్నవాఁడ నిదియె యమ్మా, ఏమికార్యంబు కోరి యిం దేఁగుదెంచితివి? ఏమిచేయుఁగవలయు నేను నీకుఁ జెపుమా యని యడిగెను.

అంతఁ గుంతి నీవు కుంతీసుతుఁడవు గాని రాధాసుతుఁడవు కావు. అధిరథసుతుఁడవుచు గావు. సూతకులజుఁడవును గావు. నామాట నమ్ము. కన్నెతటి నాకుఁ బుట్టినవాఁడవు. భవ్యమగు రీతిని గుంతిభోజభవనమందు నిన్ను ముంకఁగాఁ గన్నదానను. నీవును బార్థుఁడవే సుమా! ఘనమైన తేజమున వెలుఁగుచు సమస్తమునకుఁ బ్రకాశ మొసంగుచుఁ దనరు సూర్యదేవుండు శస్త్రభృద్రాజైన నిన్ను నాయందు సాంప్రతముగఁ గాంచినవాఁడు. కవచకుండలములతోడ వెలుఁగుచు దివ్యసుందరవిగ్రహంబువడసి మాతండ్రిభవనమందు నాగర్భంబున బుట్టినవాఁడవు. అట్టి నీవు సోదరుల నెఱుఁగక ధార్తరాష్ట్రులను దవిలి మోహంబునఁ గొలుచుచుంటి వది యెంతమాత్రమును దగదుసుమా!

గీ. క్షితిని ధర్మంబు చెప్పవచ్చినపు డనఘ
జనుఁడు తండ్రిని నేకదర్శినిని దల్లిఁ
దనర సంతోషపెట్టెడు దానికంటె
నధిక మగుధర్మఫలము లే దండ్రు బుధులు.

తండ్రీ! అర్జునుచేతఁ బూర్వార్జితంబును బిదప దుష్పూరుషులచేత నపహృతంబును నైన ధర్మరాజురాజ్యంబు ధార్తరాష్ట్రులవలన నుండి లాగికొని నీ వనుభవింపుము. కర్ణార్జునులు గలసి యుండఁ గౌరవులు కన్నులారఁ గాంచెదరు గాక; మీసౌభ్రాత్రగరిమఁ గాంచి దుర్నరులు మీకు నమ్రు లగుదురుగాక!

గీ. రామకృష్ణులు వోలె నీభూమిమీఁద
గరిమఁ గర్ణార్జునులు పెంపుఁ గాంత్రుగాక
మీర లేకమనస్కత మెలఁగుచుండు
లేని మీకు నసాధ్య మిందేది గలదు.

గీ. పంచసోదరవృతుఁడవై పరఁగు నీవు
గాంచఁగలవు మహాశోభ కర్ణ నిక్క
మలమహాయజ్ఞవేదిక యందు దేవ
పరివృతుండౌచు వెలుఁగొందు బ్రహ్మవోలె.

గీ. అన్న సర్వగుణోపేతుఁ డౌచు నాకు
శ్రేష్ఠబంధుగణమున నగ్రేసరుఁడవు
తగదు నీకింక సూతజుం డనెడిపేరు
గంటుఁడవు వీర్యయుక్తపార్థుండ వీవు.

అని యీగతిఁ బల్కినతోడుతోడనే—

గీ. కుంతిచెప్పినట్టి దంతయు సత్యంబు, చేయ వయ్య తల్లి చెప్పినట్లు
కర్ణ నీకుఁ బెద్ద కలుఁగును శ్రేయంబు, తల్లిచెప్పినట్టి దెల్లనలువ.

అనుమహాప్రణయము తెల్పువాక్యొక్కటి సూర్యబింబమునుండి వినఁబడియెను. అది తండ్రిప్రేమచేఁ గర్ణునకుఁ గర్ణపర్వ మగురీతిని భాస్కరుఁడే పల్కినట్టి దయ్యెను.

కన్నతల్లి కుంతియును గన్నతండ్రి భానుండును నిట్లు పల్కినను గర్ణుని చిత్తము చలన మొందదయ్యెను. ఓహో! యీతఁ డెట్టి సత్యధారి! ఆతఁడు కుంతితో నిట్లనియె:—అమ్మా నీమాట నామది కింపుగ నంగీకరింపఁజాల. నీవనుపును జేసితినేని ధర్మదూరగుండ నగుదును. కన్నతోడనె నన్ను విడిచితివి. అల్లపాపమున నాకు వర్ణభ్రంశరూపనాశ మయ్యె. దానిచే నాయశమును గీర్తియును నాశన మయ్యెను. క్షత్రవంశమున భూతివహించిన యింటఁ బుట్టితి నైనను నీకారణంబుచే నెవ్విధమైన క్షత్రసత్క్రియలు నెన్నండును నాకు లభింపవయ్యెను. ఇంతకంటె నెక్కుడు చెట్ట యేశాత్రవుఁడు చేయఁగలఁడు చెపుమా తల్లీ! నామీఁదను దయయుంపవలయుకాలమున నెవ్విధమైన దయయు నుంపక సమయ

సత్కారార్హసంస్కారను లేనాఁడును జేయింపక పైఁగా స్వకార్యార్థము గుఱించి నేఁ డీకీర్తిని నీకు నీవై యేలెంచి నను బనిగొనఁ బ్రయత్నము చేసితివే ? తల్లిసేయు హితము నెన్నఁడును నాకుఁ జేయవైతివి. ఆత్మహితార్థము నీతియుతమతివై నన్నిపుడు పిలిచితివి. కృష్ణసారథి యై నక్రీడిం జూచి యెవఁడు భయపడకుండును ? పార్థులతో నేనిప్పుడు కలియుట భయపడినవాఁడ నని దూఱువడుట కగును.

క. ఏ వారి కన్న నని ము, న్నే వారె ఋఁగంగ రైరి యిపు డాలమురాఁ
 గా వారి కన్న ననుచును, నే వారిం గలయ రాజు లేమనువారల్.

నాకోర్కు లెల్లఁ దీర్చి నన్ను గౌరవించి సుఖపెట్టు గాంధారేయుల యాదరణ మేరీతిని విఫలము చేయువాఁడను ? పరులతో వైరము పెట్టికొని వారు సమస్తవసువులు వాసవుని బోలె నన్నుపాసించి నాకు నమస్కరించుచున్నారు. నాబలముచేతఁ బగవారిని గెలువఁగలమని వారు నమ్మియున్నవారు. వారికోర్కె నేరీతిని భగ్నము చేయువాఁడను ? నేను దెప్పగా నీకురత్యయయుద్ధసముద్రము వారు దాఁటఁగోరుచున్నారు. అది యపార మగుటఁజేసి యల్లపారకాముల నెట్లు విడుచువాఁడను జెపుమా ? ధార్తరాష్ట్రోపజీవులయిన వారల కంపమూఁకును గాలము సంప్రాప్తమయినది నేఁడు. ప్రాణములు డాఁపక వాని ఋణము నా కెట్లయినను దీర్చికొనవలయును.

చ. జనవరు సర్వరై గుడిచి చాలఁగఁ బెంపు వహించి యొంతయు
 దనరఁ గృతార్థులై పెఁగి ధారుణిఁ గొందఱు రాజసేవకుల్
 పనివడిన ప్రిస్కీ కృతము పాటనసేయక పాపచిత్తులై
 మనము విరోధిపక్షముగ మార్చుచునున్ వెదుదీయువా రహహా.

అల్లపాపకర్ము లల్లరాజకిల్బిషు లల్లభర్తృపిండహారులు నైనవారికెల్ల నిహపరములు లేవుసుమా. నీతోడ వంచనాపూర్వకమ్ముగఁ బల్కువాఁడను గాను. దుర్యోధనునిపక్ష మూని నీపుత్రులతో నాశక్తికొలఁది యుద్ధ మాడువాఁడను. నీపల్కు లాభకర మయినను నీవు చెప్పినట్లు చేయఁజాలను, గాని, సత్పురుషోచితం బైన వృత్తమును గాని దయనుగాని విడువను. నీవిట్లు నన్నుఁ గోరుట నేను విఫలము చేయను. నీకొడుకులలో

నెవ్వరు నాకు వధియింప నర్హులును శక్యులు నగుదురు వారిని వధియింపక విడిచిపెట్టెదను. వా రెవ రంటవేని యర్జునుఁడు గాక తక్కిననలువురును. పాండవకులములో నర్జునుతోడన సమకట్టి యుద్ధ మాడుదును. యుద్ధములో వాని నంత మొందించి రాజ్యఫలమైనను బడయువాఁడను. ఆతనిచేతఁ జచ్చి కీర్తిఫలమైనను బడయువాఁడను. నీపుత్రుల సంఖ్య యేనుకంటె నెన్నఁడును దక్కువకాదు నమ్ముము. నరునిబదులు నే నైనను నా బదులు నరుఁ డైనను నుండువారము.

అని యిట్లు కర్ణుఁడు ప్రాణమున కాశింపక రాజ్యమున కాశింపక మానాభిమానియై సత్యధారియై తనకు దుర్జయుఁ డని తా నెఱింగిన యర్జునుతోఁ బోరు మాననొల్లక ధర్మయుక్తముగ దయార్ద్రబుద్ధితోఁ బలుకుచుఁ గుంతి యర్ధలాభ మొందఁ గోరికఁ గలవాఁడై

క. ఎలమి నభయమ్ము తమ్ములు
నలువురకును శత్రుకర్శనా యొసఁగితి నీ
వలదాని మఱవకు సుమీ
కలన నలుఁగు లేయునట్టి కాలమునందున్.

అని యాతనివర మతనిక్షప్తికిఁ దెచ్చెను. తెచ్చి సుఖమును నారోగ్యమును నీ కగునుగాక యని కొడుకును దీవించెను. అట్లే కొడుకును నుడివెను. అంత వా రిరువురును దమతమ గృహంబులకుఁ జనిరి.

చూచితిరా కర్ణుని దయాళుత్వము. ఱాయి పుచ్చికొని కొట్టిన వానిని వెన్నపుచ్చికొని కొట్టవలయు నని లోకములోఁ బేరిమాత్రము సామెత యొకటి కలదు. ఆసామెతకు సదర్థమం బీకర్ణునివర్తన మొక్కటియే నాకుఁ గానిపించుచున్నది.

కర్ణుఁడు పాండవుల ననరానిమాట లన్నాఁ డనియుఁ దుష్టుఁ డనియుఁ గొంద ఱందురు. శత్రువులవిషయమై యుద్ధోద్యోగములోను యుద్ధములోను బీరపుమాటలు స్వాభావికముగా ననికొనుట మర్యాదయై యున్నది. మహాత్ముఁడు నవతారపురుషుఁడు ను నైన పరశురాముఁడు భీష్మునితో యుద్ధముచేయునపుఁ డేమన్నాఁడో చూడుఁడు.

గీ. అంకు మచ్ఛితబాణశతాచితుండ
వై మృతిం గని గృధ్రకంకాదిపక్షి
భక్షితుండ వౌచుఁ బొలమునఁ బడిన నీదు
కాయమును గంగ నీతల్లి గాంచుఁగాత.

సీ. నిర్భాగ్యుఁ డైనట్టి నినుఁగన్న యాతల్లి
యాభగీరథరాజునాఁడుఁబడుచు
సిద్ధులుఁ జారణుల్ సేవింపఁగా వచ్చి
యనఘ మహాభాగ యల్లదేవి
యుద్ధకామము చేత నుబ్బి తబ్బిబ్బయి
హతుఁడవై నాచేత నాజిలోన
దిక్కులే కిలమీఁద నక్కటా పడియున్న
నిను గాంచినట్టిదై నేఁడు భీష్మ
యింకఁ గంటికి నేలకు నేకధార
గాఁగఁ గన్నీళ్లు వలవల గార్చుచున్న
దగుచు నేడ్చుఁ గావుత మక్కటకట
తగనికష్టము వచ్చె నీతల్లి కిపుడు.

గీ. యుద్ధమునఁ బ్రాణ మిచ్చెదవోయి భీష్మ
రమ్ము నాతోడఁ బదపద రథము మొకలు
గాఁగలుగు నట్టి పరికరగణము గొంచు
భారతర్షభ మర్షద పౌరవేంద్ర.

ఇట్లు బీరములు పలికిన మహానుభావుఁడు భీష్ముని జంకఁగలిగెనా. ఆయనతుచ్ఛుఁడా. ఆయనపల్కులు భీష్ముని కవమానకరము లైనవా! భర్త యోడిన ద్రౌపదిని నన్యుని వరింపు మని కర్ణుఁ డనుట తప్పైనదో! భర్త యైన యుధిష్ఠిరుఁడు భార్యనోడుట తప్పా? అతఁ డోడినభార్య నన్యుఁ గోరికొను మని కర్ణుఁ డనుట తప్పా? ఈరీతివే స్వల్పవిషయములు గ్రహించి కర్ణుని నిందింతురు.

మఱియుఁ బాండవులు జూదపుసమయమును బట్టి తమయజ్ఞాత వాసమునకు నిర్ణయింపఁబడ్డ కాలమయిన యొకయేఁడు సంపూర్ణముగఁ

గడపకమున్నే కాన్పించినా రని గోగ్రహణారంభసమయమందు దుర్యోధనునకు సంశయము పుట్టినది. ఆసంశయము భీష్ముఁడు తీర్పఁగలవాఁడని ద్రోణుఁడు చెప్పుట యును దనకుఁ గలజ్యోతిశ్శాస్త్రపాండిత్యప్రకర్షము చూపి పదుమూఁడుసంవత్సరములలో వచ్చిన యధికమాసములు గణింపఁగా నప్పటి కైదునెలలుఁ బండ్రెండుదినము లధికము లయిన వనియును దానిచే సమయము యథాశాస్త్రముగ నడపఁబడియె ననియును నాదినమునకేఁ బూర్వదినముతోఁ బదుమూఁడుసంవత్సరములు నిండె ననియు భీష్ముఁడు తీర్పుతీర్చినవాఁడు.

ఆతీర్పు నిష్పక్షపాత మయిన దనుట చింత్యము. సంవత్సర మని వ్యాఖ్యానించి మితిపెట్టినప్పుడు పండ్రెండు నెలలను బట్టి గాక సంవత్సరమును బట్టియును నెల యని వ్యాఖ్యానించి మితిపెట్టినప్పుడు ముప్పది దినములను బట్టి కాక నెలను బట్టియును లెక్క చూడవలయుఁ గాని యొండు విధముగఁ జూడఁగూడదు. యీవిషయ మిప్పటి రాజభృత్యు లెల్ల లెస్సగ నెఱింగినదియే. ఈమానముచేత లెక్కచూచియే ప్రకృతపురోహితునితోఁ గర్ణుఁడు.—

గీ. తొల్లి దుర్యోధనునకు నైద్యూతకేళి
సేసి యోడించెఁ దా యుధిష్ఠిరుని శకుని
సమయమును బట్టి తానల్ల యమతనూజుఁ
డడవిలో నివసింపంగ నరిగినాఁడు.

క. సమయము నడప కిపుడు రా
జ్యముఁ దనతండ్రి దగుదాని నాతఁడు వడయం
గమకించె ప్రకృతమాత్స్యాల
చమూసమూహములఁ జేరఁజని మూర్ఖుండై.

గీ. బలిమిచేసిన నెవరి యోపండితుఁడ
యీసుయోధనుఁ డెమ్మైన నీఁడు తుదకు
ధర్మమున నైన నీతఁ డీధరణియెల్ల
పెట్టిపగవానికైనఁ దా నిచ్చు నెలమి.

క. తమపిత్రుపై తామహారా
జ్యము మఱలం బడయఁ గోర్కి యమ్యోన యేనిం
దమప్రతిన చొప్పునం గా
లము వనిలోఁజరపఁగావలయుఁ గౌంతేయుల్.

క. అప్పుడు నిర్భయులై తా
మొప్పఁగ రారాజుచెంత నుండఁగఁదగు వా
రిప్పుడు కేవలమూర్ఖత
నొప్పదు తొల్పఁగ సధర్మయుత మగుబుద్ధిన్.

అని నిర్భయముగఁ జెప్పినవాఁడు.

వ్యాసోద్యోగపర్వములో నిరువదియొకటవ యధ్యాయములోని 10–11 -12–13–14, పద్యములు చూడవలయును. ఆమూలపద్యములనుబట్టి తెనుఁగున నేను రచించిన పద్యములే యివి. దీనింబట్టి కర్ణుఁడు తుచ్ఛుఁ డని చెప్పవచ్చునా? కర్ణునియీమాటలకు సరియైన యుత్తరము చెప్పినవాఁడా భీష్ముఁడు? కర్ణునిమాటలు పూర్వపక్షము చేసినవాఁడా? చేయఁడయ్యెను. చేయక—

క. ఈమాట లేమి కార్యం
బామేటి మగం డొకండ యర్జునుఁ డని లోఁ
డా మన యాఱ్వర గెలువం
డే మొన్నను దలఁచికొమ్మ యెద నది సూతా.

క. ఆనాఁడు విరటుపురమునఁ
గాసీనా నీవు నీవె కయ్యములోనం
గానవె యాజయశీలుని
చే నపుడైనట్టి వీరచేష్టల నెల్లన్.

కం. ఇది యాబ్రాహ్మణు చెప్పిన
యది యాగతిఁ జేయమేని యని వారలచేఁ
దుదిఁ జచ్చి నోట మన్నే
యదిరా కట్టికొని పోదు మట మనమెల్లన్.

అని మాత్రము చెప్పినవాఁడు. ఇవి యయ్యధ్యాయములోనే 16-16(a)-17 నగుపద్యములు. ఇవి ద్రుపదపురోహితుని మాటలకు సమాధానములా, కావు. ఆమాటలకు సంబంధించి లేవు. తనవాదమునకు బలమున్నయెడ ద్రుపదపురోహితునివాదము భీష్ముఁడు పూర్వపక్షమే చేయును. అట్లు చేసినవాఁడు కాఁడు. పాండవులకు సమయభంగ మైనదని బలరాముఁడు కూడఁ జెప్పినవాఁడు. అభిమన్యుని వివాహానంతరంబ విరాటరాజు కొలువుకూటంబున శ్రీకృష్ణుం డధ్యక్షుం డయి పాండవుల రాజ్యప్రాప్తివిషయమై దూతను గౌరవులయొద్దకుఁ బంపవలయు నని తీరుమానించినపు డాతఁ డే మన్నాఁడో చూడుఁడు—

ఉ. ఎన్నఁడు వారి కొల్ల రెుకయింతయుఁ బుట్టఁగఁ జేయరాదు రా
జోన్నతిచే మదించి కడుద్యూతమునందుఁ బ్రసక్తుఁడౌచుఁ దాఁ
బన్నుగఁ గోలుపోయె ధరఁ బాండవవర్యుఁడు వీరిపంతపుం
బన్నముచే బలీయులుగ వారల కయ్యది సంక్రమించెఁ జూ.

వ్యాసోద్యోగపర్వమున రెండవయధ్యాయములో నెనిమిదవ పద్యము. ఇందు సమయభంగ మైన దని చెప్పిన కారణమున బలరామునిఁ దులువ యని చెప్పవచ్చునా? కూడను కూడదు. కావునఁ గర్ణుఁ డుత్తముఁ డయిన ప్రెగ్గడయును భటుండును గాని యధముఁడు గాఁడు.

బాలకవి శరణ్యము-రెండు నైషధ ప్రయోగములు.

కిళాంబి రాఘవాచార్యులుగారు ఎం. ఏ., బి. ఎల్.

శ్రీ గిడుగు వేంకటరామమూర్తి పంతులుగారు తమ బాలకవి శరణ్యమున (పు. 89) 'చేతురు. కోతురు' మొదలగు శబ్దముల ప్రామాణికత్వమును జర్చించుచు, లాక్షణికులసర్వజ్ఞత్వమును, పరిష్కర్తలమాఢ్యమును గర్హింపుచు నీక్రిందివాక్యముల వ్రాసిరి.

'శ్రీనాథుని' నైషధమునందు (2-88) వ పద్యములో పూర్వముద్రణమున సేతురు అనేపాఠ ముండగా బ్ర॥ వేదము వేంకటరాయశాస్త్రులవారు తాము పరిష్కరించి అచ్చువేయించిన పుస్తకములో పాఠము సవరించి వ్యాఖ్యానములో పూర్వముద్రణపాఠమున చేతురు-అప శబ్దము-చేయుదురు- సాధువు. అని వ్రాసినారు. మేము చూచిన తాటాకుపుస్తకములలో 'చేతురు' అని ఉన్నది. ఎన్నోపద్యాలు వీరిపరిష్కరణమువలన మారిపోయినవి. ఏమిచెప్పను.'

నైషధములోనిపద్యమిది.

తే. హంసతూలికాతల్పంబు నందు మేను
సేర్చినప్పుడు నేత్రరాజీవయుగముఁ
జేరి చుంబించి మోహింపఁజేయు నతని,
నతివ, నిద్రయు నీవు నే మూడు రాకొ్ర ? (2-88)

ఇది వేదమువారి ముద్రణమున గలపాఠము. వ్యాఖ్యానమున 'చేయ రతని' 'చేతు రనిన' యనుపాఠములు నిరసింపఁబడినవి. వావిళ్ళవారి ముద్రణమునఁ 'చేయుదురన' అను మఱియొకపాఠము గనఁబడుచున్నది. పరిషద్భాండాగారమునఁ గలమూఁడుతాటియాకుప్రతులఁ బరిశీలించ వానియందు 'మోహింపఁజేయునతని' అనియే గలదు. (గ్రంథ

సంఖ్య- 99, 887, 39౨0,) 'చేతురు' అని యీ తాళపత్ర ప్రతులం గన్పడను. 'మేము చూచిన తాటియాకుపుస్తకములలో 'చేతురు' అని ఉన్న' దని పంతులుగారు వ్రాసియున్నారు. ఏ యేప్రతుల వీరు చూపిన పాఠము గలదో, యవి యెచట నున్నవో తెల్పినచో బాగుగనుండి యుండును. పరిష్కర్తలకు గ్రంథముల సవరింప నెట్టిస్వాతంత్ర్యము కల దనువిషయమును గూర్చికాని లాక్షణికులసర్వజ్ఞత్వమును గూర్చిగాని నేను విమర్శించుట లేదు. వారు దహరించిన ప్రయోగములు కలవా లేవా యను విషయమే మనకు ముఖ్యము.

(2) 'శృంగారనైషధములో (6-33) శ్రీనాథుడు వినీవిననిభంగి అని ప్రయోగించినాడు. సీతారామాచార్యులవారు వినిన్వినని అనేపాఠము ఎత్తుకొని ప్రౌ. వ్యా. 116 లో అనుశాసించినారు. కళాప్రపూర్ణ వేదం వేంకటరాయశాస్త్రిలవారు క్త్వార్థకముపైనువర్ణము యువర్ణహీనముగా నుండుట ప్రశస్తముకాదనిన్ని ఆచార్యులవారు అభారతప్రయోగ ముదహరించినారనిన్ని ఆక్షేపించినారు.' (పు. 253-254)

సీతారామాచార్యులవారి యనుశాసనము, వినిన్వినని యను దాని ప్రామాణికత్వ మటుండఁ, బెమత్పుస్తకభాండాగారమునఁ గల మూఁడుప్రతులయందును 'వినివ్వనిభంగి' అనియే గలదు. 'వినీవినని' యనుప్రయోగ మెచ్చటనుగానరాదు. ఇదియు నెచ్చటిదో వీరు దెలిపి యుండ లేదు.

పండితులు గాని గ్రంథభాండాలయాధికారులుగాని శృంగార నైషధపుప్రతులలోఁ బైసందర్భముల నెట్టిపాఠాంతరములు గలవో తెలిపినచోఁ గృతజ్ఞులము.

ఆముక్తమాల్యదలో నొకపద్యము.

ఆముక్తమాల్యదయందుఁ బ్రథమాశ్వాసమునఁగల (1-15)

ఆ. తెలుఁగదేల యన్న దేశంబు దెలుఁ గేను
దెలుఁగువల్లభుండఁ, దెలుఁగొకండ
యెల్లనృపులుగొలువ నెఱుఁగవే బాసాడి
దేశభాషలందుఁ దెలుఁగులెస్స.

అను పద్యమునకుఁ బండితులు భిన్నార్థముల వ్రాసియున్నారు.

(1) వేదమువారి గ్రంథమున- తెలుఁగొకండ యనునది ప్రత్యేకముగఁ గైకొనఁబడి, తెలుఁగొ=తెలుఁగు భాషయన్ననో, కండ=పులకండము అని యర్థము వ్రాయఁబడినది. ఇది సమంజసముగఁ గన్పడదు. దేశభాషలందుఁ దెలుఁగు లెస్సయని నాల్గవపాదముననుండ, దెలుఁగు పులకండమువంటిదని వ్రాయనవసరము గన్పడదు.

(2) ఆముక్తమాల్యదకు గట్టుపల్లి శ్రీనివాసకవిరచించిన వ్యాఖ్యానమునకు వ్రాఁతప్రతియొకటి ప్రాచ్యలిఖితపుస్తకభాండాగారమునఁ గలదు. అందు-

'నేను తెనుగువల్లభుఁడను । అటుగనక । తెనుగొకటే । కావ్యమెుక్కటే తెనుగా । సకలమున్ను తెనుగనుట । మరిన్ని సకలదేశాధిపతులున్ను నిన్ను కొలిచేటప్పుడు వారితో ఆయాభాషలతో మాట్లాడేటప్పుడు దేశభాషలలో తెనుగుమంచిదని యెరగవా అనుట' అని వ్రాయఁబడినది. దీనిలో, తెనుఁ గొకండ యనుదానికి వ్రాసిన యర్థము కూడ సందర్భరహితముగ నున్నది.

(3) వావిళ్లవారి ముద్రణమున (1907) రుచిసమాఖ్యాన మను వ్యాఖ్యానముగలదు. అందు 'తెలుఁగొక్కటియే అనఁగా నదివింతగాదనుట—ఎల్లనృపులు గొలువన్=సకలరాజన్యులు సేవింపఁగా, బాసాడి=నీవు సంభాషించి, యెఱుఁగవే=కాకువ్వర్థమువలన సకలదేశభాషల నెఱుఁగుదువనుట, దేశభాషలందుఁ దెలుఁగులెస్స' అని కలదు. ఈవ్యాఖ్యా

నమునఁగూడ 'అనఁగానది వింతగాదనుట' యనుటలో విశేషార్థము స్ఫురించుటలేదు.

ఈపద్యమునఁ బాఠాంతరము లున్నటులు గన్పడుట లేదు. అట్టియెడ రెండవపాదాంతమున 'తెలుఁగొకండ' యని విరామముతోఁ బఠించుట సందర్భరహితముగనున్నది. తెలుఁగదేలయన్న దేశంబు తెలుఁగు, నేను తెలుఁగువల్లభుఁడను, యెల్లనృపులు గొలువఁదెలుఁగొకండ బాసాడి దేశభాషలందుఁ దెలుఁగు లెస్స యటంచెఱుంగవే యనునర్థము గైకొనినచో నన్వయకాఠిన్యము గాని సందర్భరాహిత్యము గాని యుండదేమో? ఇట్టియర్థమును గైకొనిన కృష్ణరాయలసభలో నాంధ్రమే రాజభాషయని తేలుచున్నది (Court language) ఆంధ్ర మాతని మాతృభాష యగుటయే యందులకుఁ గారణ మని మన మూహింపవలయును. వివిధభాషలు గలదేశములలో నొకభాష రాజభాషగఁ బరిగణింపఁబడుటయు వింతగాదు. నేటిన్యాయస్థాన విద్యాలయముల నాంగ్లమునకుఁ గల ప్రముఖతయే దీనికిఁ దార్కాణము. అందును సార్వభౌమునకు మాతృభాషయగుటచేఁ గృష్ణరాయల యాస్థానమున నదియే యగ్రస్థానమును వహింపనొప్పును. ఈసందర్భమున వేంకటరాయశాస్త్రులవారు 'ఆడి-తెనుఁగును రాజులతో నాడి నేర్చెనే గాని చదివి నేర్చినవాఁడుగాఁడు. నృపులు అనుటచే తెనుఁగు ఆతని ఇంటిభాషగాదు' అని వ్రాయుట ప్రమాణరహిత మనియు, మూలమునకు విరుద్ధ మనియు నెఱుంగవలయును. ఎల్లనృపులుఁ గొలువ బాసాడి యనుచో నాంధ్రము కృష్ణరాయల మాతృభాష కాదని యేల స్ఫురింపవలయును? విజ్ఞులీవిషయముల నిదమిత్థ మని నిర్ణయింతురుగాక.

రామాయణము-జైన బౌద్ధ గ్రంథములు.

కిడాంబి రాఘవాచార్యులుగారు, ఎం. ఏ., బి. ఎల్.

రామాయణమునందలి కథను జైనులును బౌద్ధులును తమమతానుగుణ్యమగు మార్పులతోఁ గైకొనిరని మనము తెలిసికొనవలసియున్నది. బౌద్ధుల జాతకకథలయందు రామాయణకథయు, దశరథుని శాపవృత్తాంతమును, ఋష్యశృంగునికథయుఁగలవు. దశరథజాతకమునకును రామాయణేతివృత్తమునకుఁ జాల భేదముగలదు. దశరథుని శాపవృత్తాంతము ననుసరించు కథయొకటి సామజాతకమునఁ గలదు (Jataka Stories No. 540). సాముఁడనుఋషికుమారుఁడొకఁడు, అంధులగు తనపితరుల సేవించుచుండెను. కాశీరాజగు పిలియక్షుఁడు మృగయావినోదియై బాణముతో నాతనిఁ గొట్టెను. సాముఁడును శాంతుఁడై తనతలిదండ్రులకై విచారించి యాతనికి వారున్నచో టెఱింగించి మూర్ఛనొందెను. రాజంతలకు విచారింపుచుండ నాయరణ్యదేవత సాముని తలిదండ్రులను భక్తిశ్రద్ధలతోఁ గొలిచిన నతని పాపము తొలఁగునని పలుకును. ఆసార్వభౌముఁడంత జలఘటంబును గొని వారిం జేరి తన్నెఱింగించుకొని, వారొసంగిన సపర్యలకొంది, కుమారునిమరణమును వారికిఁ దెలుపును. వారు విషాదగ్రస్తులై తమ్మాతనిచెంతకుఁ గొనిపొమ్మని యాతనిఁ వేఁడిరి. సాముని మృతశరీరము చెంత వారు మంత్రములఁ బఠింప నిద్రఁ జెందినవానివలె నాతఁడు పునర్జీవితుఁడయ్యెను. రాజాతని నాశ్రయించి యాతనివలన రాజధర్మముల నెఱింగి తన పట్టణమునకుఁ బోయెను.

మూలమునఁగల శాపవృత్తాంత మిటవిడువఁబడి, సామునియొక్కయు నాతని తలిదండ్రులయొక్కయు శాంతస్వభావమునకు, సత్ప్రవర్తనమునకుఁ బ్రాముఖ్య మొసఁగఁబడినది. ఋష్యశృంగునికథయు రెండుజాతకములఁ గలదు (No. 523, 526). నళినికాజాతకమున ఋష్యశృంగుఁడు (పాళీలో ఇసిసింగుఁ డని కలదు). అలంబుస యను నచ్చరకన్నె

మాయలం జిక్కి మోహితుఁడాయెనని కలదు. రామాయణమునఁగల శాంతావృత్తాంత మిందు లేదు. ఋష్యశృంగుఁడొకయాఁడు లేడికి జన్మించి నొక ఋషి దయార్ద్రచిత్తుఁడై యాతనిఁ బెంచెనని కలదు. ఈవృత్తాంతమే బార్హుట్ (Barhut Stupa) స్తూపమునఁ జిత్రింపఁబడినది.

జైనులును రామాయణకథను మార్చి వివిధకావ్యముల రచించిరి. అందుఁ బ్రాచీనమగునది విమలసూరి రచితమగు పఉమచరియ(పద్మచరిత) మనునది. ఈగ్రంథము మహావీరుని నిర్వాణానంతరము 530 సంవత్సరములకు రచింపఁబడెనని యందే తెలుపఁబడియున్నది. ఇది జైనమహారాష్ట్రీ యను ప్రాకృతభాషలో నార్యావృత్తములలో రచింపఁబడెను. రాముఁడే పద్ముఁడు. వాల్మీకిరామాయణమున నసత్యములు పెక్కులుండుటచే మహావీరుని శిష్యుఁడగు గౌతముఁడు బింబిసారునికిఁ దెలిపినరీతిని దా నాగ్రంథమును రచించితి నని కవి గ్రంథాదిని వ్రాసెను. వానరుల నొక మానవజాతిగ వర్ణించుట పొసఁగదని వారు విద్యాధరవంశజు లనియు, గృహపట్టణద్వారములందును కేతనములందును కపిచిహ్నమునుంచుటచే వారు వానరులని పిలువఁబడిరని కవి యుత్ప్రేక్షించియున్నాఁడు. రావణాదులును రాక్షసులుగారు. విద్యాధరులపాలనమున నుండిరి. రావణునితల్లి యాతనికంఠమున నొకముక్తాహారము నుంచెననియు నందాతని శిరస్సు తొమ్మిదిసారులు ప్రతిబింబితమగుటచే నాతఁడు దశగ్రీవ దశానన శబ్దవాచ్యుఁడాయెననియు గల్పింపఁబడినది. అతఁడొకగొప్పజైనభక్తుఁడు. జైనదేవాలయములఁ బునరుద్ధరణ మొనర్చెను. హనుమంతుఁ డతనికి యుద్ధములసహాయ మొనర్చెను. దశరథున కనంతరథుఁ డనుసోదరుఁడుండెను. అతఁడు వార్ధక్యమున రాజ్యమును విడిచి జినభక్తుఁడయ్యెను. దశరథునకు అపరాజిత, సుమిత్ర, కైకేయి యనుముగ్గురుభార్యలు కలరు. అం దపరాజితకు, పద్ముఁ డను రాముఁడును, సుమిత్రకు లక్ష్మణుఁడును, కైకేయికి భరతశత్రుఘ్నులును జన్మించిరి. సీతయు నాఁగటిచాలున దొరకియుండలేదు. జనకునకు నాతని భార్యయగు విదేహకును బుట్టిన కూఁతురు. వా రామెను పద్మునకు వివాహము చేయ నిశ్చయించిరి. కాని

విద్యాధరులరాజగు చంద్రగతి యను నాతఁడామెకొఱకువచ్చి తనకార్ముకమును జనకునకు నొసఁగెను. దానిని భంగ మొనర్చిన రాకొమరునకు సీత నిచ్చెదనని జనకుఁడనెను. పద్ముఁడు ధనుర్భంగ మొనర్చి సీతం బెండ్లియాడెను. తరువాతివృత్తాంతమునఁగూడ నిట్టిమార్పులు పెక్కులు గలవు. భరతు నతనితల్లియగు కైకేయియు, సోదరుఁడగు పద్ముఁడును రాజ్యమును గైకొనుమని యాజ్ఞాపింప నాతఁడు పద్ముఁడు మరల వచ్చువఱకు రాజ్యము నేలుట కంగీకరించెను. సీతాపహరణము, హనుమంతుని యన్వేషణము, రావణవధ, సీతాసమాగమము, పౌరులామెను దోషిగఁ దలఁచుట, వనవాసము, కుశలవుల జననము మొదలగునవి పెక్కులుపాఖ్యానములతో వర్ణింపఁబడినవి.

విమలసూరి యొక్క కథయే తరువాతి రామకథలకు మూలముగ నుండెను. దాని ననుసరించియే రవిసేనుఁడు తనపద్మపురాణమును క్రీ. శ. యేడవశతాబ్దమున రచించెను (678 A. D). ఇందును రాముఁడు పద్ముఁడని పేర్కొనఁబడియెను. కుశలవులు లవణాంకుశులయిరి. జీవహింసమాంసాహారవర్జనము, మొదటి జైనతీర్థంకరుఁడగు ఋషభుని మహిమానువర్ణనము మొదలగువిషయములు చాలఁగలవు. ఈరామకథయే గుణాఢ్యునియుత్తరపురాణమున నలువదియెనిమిదవపర్వమునఁ గలదు.

హేమచంద్రుఁడు (పండ్రెండవ శతాబ్దము) తన త్రిషష్టిశలాకపురుష చరిత్రమున నేడవపర్వమున నీకథను మఱల రచించెను. దీనినే హేమచంద్రుని రామచరితమనియు, జైనరామాయణమనియుఁ బిలుతురు. అదియు రాక్షసవానరుల వృత్తాంతములతోఁ బ్రారంభమగును. నాలవసర్గము మొదలు పదియవ సర్గాంతమువఱకు సీతారామలక్ష్మణులకథవర్ణింపఁబడినది. ఈగ్రంథము ననుసరించియే పదునాఱవశతాబ్దమున రాజవిజయసూరి శిష్యుఁడగు దేవవిజయగణిచే రామచరితమను గద్యకావ్యము రచింపఁబడినది. కృష్ణదాసుని పుణ్యచంద్రోదయ పురాణమను మఱియొక గ్రంథము కూడఁ గలదని రాజేంద్రలాలుమిత్రగారు వ్రాసియున్నారు.

గ్రంథస్వీకారము.

1 ఆంధ్రులచరిత్రము: అయిదవసంపుటము.

(కాకతీయాంధ్రరాజయుగచరిత్రము.)

గ్రంథకర్త—శ్రీచిలుకూరి వీరభద్రరావు పంతులుగారు.

శ్రీవీరభద్రరావుపంతులుగారు 1912 వ సంవత్సరములోఁ బ్రకటించిన యాంధ్రులచరిత్ర రెండవభాగములోనివిషయములనే యిటీవలఁ బ్రకటింపఁబడిన శాసనములలోని నూతనచరిత్రాంశములు క్రొత్తవిషయములును జేర్చి యితిహాసతరంగిణీ గ్రంథమాలలో మొదటిపుస్తకముగా నీ గ్రంథమును బ్రకటించియున్నారు.

మొదటిప్రకరణములోఁ గాకతిశబ్దవిచారణయుఁ, గాకతీయవంశమునకు మూలపురుషుఁడు కాకర్త్యగుండ్యన యగునా కాదా యను విషయమును జర్చింపఁబడినవి. రెండవప్రకరణములో లక్ష్మణరాయపరిశోధకమండలివారు ప్రకటించిన "తెలింగానా శాసనముల"లోని గూడూరు మాటేరు శాసనములలోని విషయములపై విపులమగు చర్చ గలదు. వీరిమూలవంశము కాకతీయరాజవంశముకంటె భిన్నమైన దని యుఁ గాకతిరాజవంశమే తరువాతి బ్రహ్మణ్యరాజవంశ మైనదనియు వీరభద్రరావుగారి యభిప్రాయము. మూఁడవప్రకరణమునఁ జక్రకోట్యమండలచరిత్రమును నాల్గవప్రకరణమునఁ గాకతీయరాజుల పరిపాలనారంభమునాఁటి యాంధ్రదేశస్థితియు, కాజీపేటశాసనమువలనఁ గాకతీయరాజచరిత్రములోఁ గల్గిన మార్పులును జర్చింపఁబడినవి.

పంచమప్రకరణములో పలనాటివీరచరిత్రము నాఱవప్రకరణము మొదలు పదునైదవప్రకరణమువఱకుఁ గాకతిరాజుల పరిపాలనాదికములును వివరింపఁబడినవి.

మహాదేవరాజు రాజ్యపాలన చేసెనా లేదా యనువిషయమును రుద్రమదేవి ప్రతాపరుద్రులను గూర్చియు, రుద్రమదేవిభర్త చాళుక్య

వీరభద్రునిగూర్చియు, కోనహైహయులనుగూర్చియు నూతనవిషయములనేకములు తెలియఁజేసియున్నారు. ప్రతాపరుద్రునితల్లి ముమ్మడంబకు రుద్రమదేవికిని గలసంబంధము, ముమ్మడంబభర్త మహాదేవరాజునకుఁ జాళుక్యవీరభద్రునకుఁ గలసంబంధమును గూర్చి చరిత్రచతురాననులు చాలఁ జర్చించియున్నారు. గ్రంథము స్వల్పకాలములో నచ్చొత్తింపఁబడుటచేఁ గాఁబోలును కొన్నియచ్చుతప్పులు దొరలినవి. ఈతప్పులను దీసివేసి కాకతీయులశిల్పకళ ఆర్థికపరిస్థితులపైఁ గొన్నిక్రొత్తప్రకరణములఁ జేర్చి రెండవముద్రణములో దీని నింకను జరిత్రకారుల కుపయోగించునట్లు చేయుదురుగాక. కాలనిర్ణయములోఁ గొన్నితప్పులు, ప్రమాణగ్రంథము లుదాహరించుటలోఁ గొన్నితప్పులు గ్రంథమునఁ గలవు. వీనిని రెండవముద్రణమున సవరించి 'ఆంధ్రులచరిత్రము'లోని మిగిలినభాగములను గూడఁ బ్రకటించి దేశీయులకృతజ్ఞతకుఁ బాత్రులవుదురుగాక.

వ. శ్రీ. రా.

---

2 ఆంధ్రకథాసరిత్సాగరము—పద్యకావ్యము.

లా వా ణ క లం బ క ము.

పీఠికాపురసంస్థానాస్థానవిద్వత్కవు లగు వేంకటరామకృష్ణకవులు రచించినది. ప్రస్తుతోపలబ్ధబృహత్కథాసార మగుకథాసరిత్సాగరములో నీ లావాణకలంబకము మూఁడవది. ఆఱుతరంగములతో నిది ముగిసినది. మొదటి రెండులంబకములను విడిచి మూఁడవదానినే ముందుగాఁ బ్రకటించుటకు హేతువు తెల్పఁబడియుండలేదు; కావునఁ బాఠకులకు మొదటి రెంటిని రచింపఁబడనే లేదా రచియింపఁబడినఁ బ్రకటించుట కభ్యంతర మేమి గల్గిన దను నూహలకుఁ గారణము కాకమానదు. ఆవిషయము కొంతే ముందు తెలుపవలసినది. మాకిచ్చిన భాగములో లేదో మొదటఁ జేర్పనే లేదో పీఠిక లేదు, విషయసూచిక లేదు, వెల లేదు. దొరకుతావు వ్రాయలేదు. మఱియు నిట్టియుద్గ్రంథము ౨౧౦ ప్రతులు మాత్రమే ప్రచురించిరి. పయివిషయములకుఁ గవులయాశయ మేదో ముందుఁ దెలిసికొందము.

ఈసంపుటములో వివిధవృత్తములు ౧౩౬గిర, గలవు. కవిత చక్కనిది, యుభయభాషానైపుణి గలది. హృద్యపద్యగద్యగమనిక గలది. మృదుమధురపదయుతము— చూడుఁడు:—

చ. కర మనురక్తి వల్లభునిఁ గన్గొని దిగ్గున లేచి హర్ష ని
స్సరదురుబాష్పపూరములఁ జయ్యన నాతనికర్ఘ్యమీయఁగా
నరుగుచు నున్నభంగిఁ జని యట్టె తదీయగళంబునన్ మనో
హారనిజబాహుమాలికల నాదర మొప్పఁగఁ జుట్టి బిట్టుగాన్.4-333.

దీర్ఘసమాసములు, నతికఠినపదములుం గానరావు. పురాణశైలిం గథ చదివినంతన దెలియుచున్నది, కఠినపదవ్యవధానమై యర్థమున కడ్డు వచ్చుట లేదు. ఇంతకంటె వ్రాసిన నది స్తుతియగును-

పద్యముల మచ్చు:-

మ. కని శోకాతిశయంబుచే నవశమై గాత్రంబులూడఁదీ
సిన చందంబున వ్రాల నానృపతి నిశ్చేష్టత్వముంబొంది చ
య్యన ధాత్రీస్థలిపైఁ బడెన్; భయసముద్యత్కంపభూయిష్ఠమై
తనికెన్ వాసవదత్త డెంద మతిమాత్రం బబ్జపత్రాంబువై. 2-125

సీ. ప్రాణనాయక! నాఁటిరాత్రి దేవీగృహాం
గణమున విన్నవాక్యమ్ము నీకుఁ
దలఁపున నున్నదే? తప్పక నిన్నొక్క
నెల యైనపిదపఁ దన్నిలయమునకుఁ
దీసి రమ్మని కదా దివ్యవాణి వచించె?
మఱచితో నీవది మానసమున?
నేఁటితోఁ బూర్తిగా నెలాళ్లుఁ గడచెఁగా
వున నో ప్రియా! యిట్లు వినువవలసె
ననవుడు విదూషకుండు నెయ్యమునఁ జేసి
తన మనోహర వల్లిన తదుచితోక్తు
లాలకించి గతం బెల్ల నాకళించి
కరమసంతోషపరిపూర్ణ భావుఁ డగుచు. 4-184

చ. తెలియఁగవచ్చె నీకుఁగల తీయము నాయెక నార్యపుత్ర! కే
వలమును నీవ నాకు నిఁకఁ బ్రాణమవైతి విఁ కేల నాకు నీ
చెలువలు నిర్మ్యెడన్ గలుగుసిద్ధులు? నే భవదీయ సద్గుణం
బుల విలువంగఁబడ్డ రొక పొత్తుల దాసిక నైతి నో విభూ! 4.340

గద్యంబున వేంకటరామకృష్ణకవులు రచించిన ట్లున్నను షష్ఠతరంగము కడపట— క. పలుకుల వెలంది మెట్టటు పలికించిన నట్టు లేరు బలికితి దోసఁగుల్ గలిగిన మన్నింపుఁడు— అను దానిలో వేంకటరామశాస్త్రిగారొక్కరే రచియించినట్లు కనఁబడుచున్నది. ఈకృతిని శ్రీపీఠికాపురయువరాజుగారి కంకితము చేసినను ప్రథమతరంగము, రెండవపద్యములో "అనవరత భారతాదిమహాపురాణ పఠనరంజిత పరిశుద్ధభావులార! విమలగౌరవ విజ్ఞాన విమలధీ ప్రశస్తులారా! త్రిలింగదేశస్థులార!"

అని వీరిని గూడ సంబోధించుటయు షష్ఠతరంగాంతమునం గాక తక్కిన తరంగాద్యంతములఁ గృతిపతిప్రశంస లేకుండుటయుఁ గ్రొత్తదారి.

ఈ కథాసరిత్సాగరము నిజముగాఁ గథలకు సాగరమే. ఇందు లేనికథలు లేవు, గాథలు లేవు, హాస్యములు లేవు, న్యాయములు లేవు. రాజనీతులు లేవు. లోకములోనున్న ముద్రారాక్షస, మల్లికా మారుత, నాగానంద, రత్నావళీ ప్రభృతి సర్వనాటకములకు మూలమీసాగరమే. కాదంబరికథ యిందులోనిది. విక్రమార్కకథ లిందులోనివి, బేతాళపంచవింశతి యిందులోనిది, పంచతంత్ర మిందులోనిది. మనవారు ప్రకటించు కాశీమజిలీలకు పేరుపెట్టినవి యిందులోనివి. భారత భాగవతరామాయణముల కథ లిందులోనివి. నవరసములతోడి సర్వవిషయములు నిందులోనివి. ఇందు లేనివి మన భరతఖండములో నెందును వేఱుగా లేవు. ఈ సాగరకథావీచి నొక్కింతయాధారము చేసికొని, యీయుదధిగాథాబిందువు నొక్కదాని నూఁతగొని మన పూర్వకవు లనేకములు పెద్ద నాటకము లాడినారు. వేంకటరామకృష్ణకవు లీపద్యకావ్యమును రచింపఁ బూనుటఁ గడుమెచ్చఁదగినది.

గీ. అశ్వమేధంబుఁ జేయు మో యధిప యట్లు
శాశ్వతం బగుధర్మంబు సంఘటిల్లు
విశ్వనుత మైన సంతతి వెలయు నీకు
నీశ్వరప్రేరణంబె పో యీతలంపు. ౬౬

క. సరయూత్తరతటమున న
ధ్వరభూమి యొనర్పవలయు వరక్ష్మాభా
సుర మగుతురగోత్తమముం
బరికింపం దగినవారిఁ బనుపుము వేగన్. ౬౭

చ. అని యిటు లవ్వసిష్ఠముని యాదిగఁ గల్గిన మౌను లందఱుం
దనయులు నీకుఁ గల్గెదరు తప్పదు యాగము సేయుమంచుఁ బ
ల్కినపలు కాత్మసమ్మదముఁ గీల్కొనఁ జేయ సమాత్యవర్గముం
గనుఁగొని పల్కె నద్ధరణికాంతుఁడు సంతస మొప్పుచుండఁగన్. ౬౮

క. నాగురువులయానతిచే
సాగింపుఁడు యాగ మఖిలసంభారంబుల్
వేగ నొనగూడఁ జేయుం
డాగమకోవిదులఁ బిలువనంపుఁడు మఱియున్. ౬౯

క. ఈయజ్ఞ మఖిలనృపులకుఁ
జేయఁగవచ్చు నిది శాస్త్రసిద్ధ మలోపం
బై యొసఁగుచుండు యజ్ఞము
పాయక కర్తకు నభీష్టఫలము లొసంగున్. ౭౦

వ. విద్వాంసు లగు బ్రహ్మరాక్షసులు ప్రతిక్షణంబును రంధ్రాన్వేషంబు గావించుచు యజ్ఞంబునకు విఘ్నంబు చేయం జూతురు విఘ్నితం బైన యజ్ఞంబు కర్తకుం గొఱగామి సంఘటిల్లం జేయు నటుగావున నెందు నేమఱక సకలలక్షణలక్షితం బైన యశ్వంబుం దెచ్చి విడిచి యందునందు సావధానంబుగా శాంతికవిధానంబులు సేయుచు నభంగంబును సాంగంబును గా యాగంబు సాగింపుఁ డనిన విని వసిష్ఠాదులు మోదంబున నమ్మేదినీవిభుని వివేకంబుం గొనియాడుచు నిజస్థానంబులకుం జనిరి తదనంతరంబ యమ్మహీకాంతుండు మంత్రులం

జూచి మీర లప్రమత్తులరై భానుకోపదిష్ట ప్రకారంబున సత్వరం
బుగ నధ్వరసంభారంబులు సంపాదింపుండని వారల ననిచి యంతే నం
తఃపురంబున కరిగి తనపత్నులం బిలిచి పుత్రార్థం బశ్వమేధంబు సే
య నుద్యోగించితి నేఁడు దివసంబు మంచిది మీరలు యాగదీక్ష
గైకొనుం డని పలికిన. ౨౧

క. ఆకాంతామణు లందఱు
శ్రీకర మై యమృతరసము చిలికెడు నాక్షో
ణీకాంతుపలుకు విని మో
దాకలనఁ జెలంగి రాననాబ్జము లలరన్. ౨౨

వ. అంత. ౨౩

క. హితుఁడు వివేకహితుండును
మతిమంతుఁడు నైన యలసుమంత్రుఁడు తానే
కతమున మఱునాఁ డాక్షితి
పతి డగ్గఱఁ జేరి యిట్లు పలికె వినీతిన్. ౨౪

గీ. వినుతచారిత్ర విను పురావృత్త మొకటి
ఋత్విగుపదిష్ట మది నీవు తేర్చు కొనరు
వినియుఁ దడవయ్యె నేఁ దొల్లి మనసునందు
నిపుడు దలఁపయ్యె నను ప్రసంగహేతువునను. ౨౫

—ఋశ్యశృంగచరిత్రము.—

వ. తొల్లి సనత్కుమారుండు భవత్సంతానప్రయోజననిమిత్తంబుగా ఋ
షులసన్నిధిం బలికినపలుకులు కొన్ని గల వవి యాకర్ణింపుము.

క. శుభచరితుఁడు కశ్యపునకు
విభాండకుం డనఁగ సుతుఁడు వెలయు నతనికిం
బ్రభవించె ఋశ్యశృంగుం
డభంగురతపఃప్రభావదగ్ధాఘసంఘుం డై. ౨౬

క. పితృశుశ్రూషణమున సం
తతవహ్నినిషేవణమునఁ దపమునఁ గడును
న్నతి కెక్కె నతఁడు వసుమతిఁ
బ్రతిలే దితని కని మునులు పలుమఱుఁ బొగడన్. ౨౭

క. ద్వైవిధ్యము నొందెను నీక
నావరముని బ్రహ్మచర్య మాశ్చర్యముగాఁ
బావనమహనీయతపః
శ్రీవిభవ మొకింతయైనఁ జెదరక యుండన్. ౭౯

క. వైభండకిపరమతపో
వైభవ మేమనఁగవచ్చు వనజభవుండో
యాభవుఁడో యాకీర్తిన్
భూభువనంబున జనింపఁబోలుఁ దలంపన్. ౮౦

వ. ఈభంగి నాఋశ్యశృంగుం డభంగుర తపోవైభవంబున నుప్పొంగుచు
నిస్సంగుండై నీవారముష్టింపచుం డయ్యుఁ దనపుట్టి చూపట్ట స్త్రీ
పురుషవివేకంబు లేక లేఖశోకంబు వొగడ వనంబులం జరియించు
చుండు నక్కాలంబునందు. ౮౧

గీ. అంగరాజ్యాధిపతియై చెలంగఁగలఁడు
రోమపాదుం డనంగ నాభూమివిభుని
పుడమినెల్ల ననావృష్టి పుట్టు నతఁడు
నాయమెడలి ప్రజాపీడ సేయుచుండ. ౮౨

గీ. రోమపాదుండు తనదైనభూమి నెల్ల
వృష్టి లేకుంటఁ జూచి సంతుష్టివెడలి
యంత శ్రుతవృద్ధులైన బ్రాహ్మణులఁ బిలిచి
పలుకు నిట్లని వినయంబు దొలఁకుచుండ. ౮౩

క. క్షామం బెన్నఁడుఁ గన మీ
క్ష్మామండలి నిప్పు డిట్టికష్టంబా ప్రజా
స్తోమంబు వగలఁ బొగిలెడు
సేమం బెన్నఁటికిఁ గలుగు సీమకు నింకన్. ౮౪

వ. అతిఘోరం బగునీయనావృష్టిదోషంబు వాయం బ్రాయశ్చిత్తం బొ
క్కటి విచారించి యుపదేశింపుం డనిన నభ్యామిసురు లందఱు నిందు
లకు విభండకసుతుండైన ఋశ్యశృంగు రావించిన సువృష్టి గలుగు
నమ్మునిపుంగవు రావించు నుపాయంబు సేయుం డని పలుకుదు రంత

నమ్మహీకాంతుండు మంత్రులం జూచి విచార లరిగి ఋశ్యశృంగు నిచ్చటికిం దోడితెం డనిన వారును నమ్మునిశార్దూలు దుర్దమ తపోవిభవుం డిలువ నేమెంత వారలము భయం బగు వారాంగనల నంపిన వార లాఋశ్యశృంగుని దోడుకొని తెత్తు రిందుల నఘుంబును లేదతండు వచ్చినమాత్రన వర్షంబులు గురియు ధరణి కెల్ల హర్షం బగు నీ కూఁతు రగు శాంతాకన్య నమ్మానికి వివాహమ్ము సేయు మని కలుకును రట్లన యారాజపాలుండు వేశ్యల ననిచి ఋశ్యశృంగుని రావించు నత్క్షణం బున నిఖిలక్షోణి నెల్ల వర్షంబులు గురిసి సుభిక్షం బగు నారోమపాదు నల్లుం డగు ఋశ్యశృంగమునివల్లభుండు వచ్చి పుత్త్రేష్టి సేయించ దశరథమహీధవునకుం బుత్త్రులు గలుగుదు రని యిట్లు సనత్కుమారుండు పలికినాఁడు చిత్తంబున నది సత్యంబుగా నంగీకరింపుము. ౮౭

క. శాంతాకృతి యమ్మునిపతి
శాంతాసహితుఁ డయి యిటకుఁ జనుదేర మది
న్సంతాపమెల్లఁ దీఱఁగ
సంతానము నీకుఁ గల్గు జననాథమణీ. ౮౮

వ. అనిన విని సంతసిల్లి యాదశరథమహీకాంతుండు సుమంత్రున కిట్లనియె. ౮౯

గీ. శాశ్వతబ్రహ్మచర్యానుషంగుఁ డైన
ఋశ్యశృంగుని నెలయించి వేశ్య లెట్లు
తెచ్చి రవ్విధ మెంతయుఁ దేరకొనఁగఁ
జెప్పుము సుమంత్ర కౌతుకం బుప్పతిల్లు. ౯౦

వ. అనిన విని సుమంత్రుండు ఋశ్యశృంగమునిపుంగవు నంగనలు తెచ్చినవిధం బంతయు సవిస్తరంబుగా విన్నవించెద వినుం డని సకల(మంత్రిజనసమ)క్షంబున నాక్షోణీవరు నీక్షించి యిట్లని చెప్పం దొడంగె నంగరాజ్యాధిపతి యైన రోమపాదుం డట్లు తనభూమి నతిఘోరం బగు ననావృష్టి పుట్టుటకు విచారంబు నొందుచుఁ బురోహిత బ్రాహ్మణుల రావించి వారలతో నిట్లనియె. ౯౧

క. ద్వాదశవర్షక్షామం
బీదేశంబున జనించె నేకారణమో
యీదురితము వాయఁగ శ్రుతి
చోదితకర్మంబు లరసి చూపుఁడు మీరల్. ౯౦

క. ఇట్టియవగ్రహ మెన్నఁడుఁ
బుట్టను భువి నీయఘంబుఁ బోఁజేయుటకున్
గట్టిగఁ బ్రాయశ్చిత్తం
బిట్టి దని వచింపుఁ డీర లిందఱు వేగన్. ౯౧

గీ. మినుకు మినుకున నొకనాఁడు మెఱపుఁగనము
గగనమున నెందఁ జేటంత మొగులు లేదు
చినుకు బంగార మయ్యె నే మనఁగఁ దూర్పు
గాడ్పు నొక్కింత మెదల దేకారణంబొ. ౯౨

క. కొండలవలె నోదమొగు
ల్గొండొండఁ బ్రభాతవేళ నుదయించి క్షణం
బుండి యడంగెడు మఱి వెలి
యెండలు గాయంగఁ దొడఁగె నేమన నింకన్. ౯౩

సీ. చెలమ దోఁడిన నింత చెమ్మగ్రమ్మక వేఁడి
యిసుకపొలం బయ్యె నేఱు లెల్లఁ
గమలకహ్లారకవితానములు పైఁ బొరలంగఁ
జెఱువులు పంకంబు చిక్కె నింక
వనరుహంబులు వాడి వత్తులై తూలంగఁ
గలఁకనీరును లేక కొలఁకు లిగిరెఁ
జలకట్టి వేయినిల్వ్వలు ద్రవ్వినను నెందఁ
గూపంబులు జలంబుఁ జూపవయ్యెఁ
బైరు లిల వ్రాలి సురగాలిఁ బఱవసాగె
నలజలప్రాయదేశంబులందు నుండు
తరువు లెల్లను జోరువులై దళము లెడలి
నిలువులకు నెండె నొక్కింత నీడలేక. ౯౪

క. దేవబ్రాహ్మణపూజలు
గావింపుఁడు చాల దానఁ గలుగు శుభంబుల్
కావలసిన ధన మిచ్చెద
నీవేళకుఁ గాక ధనము లేటికిఁ బినకన్. ౯౫

వ. అనిన వార లి ట్లనిరి. ౯౬

క. జపములు సేయించితి మే
మపరిమితంబుగ నవగ్రహంబులకయ్యే
నపగతము గాదు నృపవర
యుపాయ మొక్కండు దోఁచియున్నది మాకున్. ౯౭

చ. వినుఁడు విభండకాత్మజుఁడు విశ్రుతధర్మవిదుండు బ్రహ్మచ
ర్యనియమవంతుఁ డబ్జభవునంతటివాఁడు సదాత్మయోగి ధీ
మనసుఁడు ఋశ్యశృంగుఁ డనుమౌని వనంబున సంచరించు న
య్యనఘుఁడు వచ్చెనేనియు భయంబెడలం గలుగున్ సువృష్టియున్.

క. ఆయనఘుఁ డిటకు వచ్చున
పాయము గావింపుఁ డిదియ పరమార్థము భూ
నాయక యకలంకాత్మత
పోయుతుఁ డాతండు దలఁప భూదివిజులలోన్. ౯౯

క. వనిత యిది పురుషుఁ డితఁ డని
మనమున నెఱుఁగం డొకింత మౌనవ్రతుఁడై
వనముననె యుండు నమ్ముని
జనపదనగరంబులకును జనఁ డొక్కపుడున్. ౧౦౦

క. అఘునఁ డిట కేతేర న
మోఘముగాఁ గురియు వర్షములు మహి శ్రుతిమం
త్రౌఘనిధి యతఁడు దీనికి
శ్లాఘించు న్లోక మెల్ల సంతోషమునన్. ౧౦౧

వ. అనిన విని రోమపాదుండు ప్రమోదంబునం బురోహితామాత్యులం
జూచి మీర లరిగి యమ్మునికుమారుం దోడి తెం డనిన వార లి
ట్లనిరి. ౧౦౨

ఉ. ఓమనుజేంద్ర యాతఁడు మహోగ్రతపోనిధి యగ్నివంటివాఁ
డేమటు పోవఁగా వెఱతు మివ్వరిఁ గల్గినవారముఖ్యులం
గామకళారసజ్ఞతలు గల్గినవారల నంచితేని వా
రామునిఁ దోడి తేఁగలరు హాసవిలాస విహారలీలలన్. ౧౦౩

గీ. మనుజనాయక తలపోయ మాయ లనఁగఁ
దోయజాక్షులె సుమ్ము చట్రాయి యైనఁ
గరఁగు వారలవిభ్రమకళలఁ గాన
గణికలనె పంపుఁ డిందు సఘంబు లేక. ౧౦౪

వ. అనిన విని యమ్మహీపతి యట్ల కాని మ్మని వేత్రహస్తులం గనుంగొని వారాంగనలం దోడితెం డనిన వారు సత్వరంబుగా మదనతంత్రసిద్ధాంతమణిపేటి యగు వేశవాటికిం జని యచ్చోట హాటకమయంబులగు శ్రమకూటంబుల మణిఘటితతులాకోటిరటితంబులు మృదంగధింధిమిధ్వానంబులతో సంబంధింపఁ బసిఁడియంచు కాసెలు ప్రకాశింప మేలంబులుగూడి వివిధతాళంబులు హస్తనృత్తంబులు సలుపువారును మణికంకణక్వణనంబులు రాణింప వీణలుపలికించువారును డిపిరిదండియలు గైకొని గాణ దండి మెఱయ మంద్రమధ్యమతారస్వరంబులు సుధారసంబులు గురియ గానంబులు సేయువారును బ్రత్యక్షపాంచాలబాహటశయ్యల నయ్యారె యనం బ్రబంధంబులు చదువువారును నొక్కొక్కదిక్కునం జక్కనికన్నెలకుఁ గొక్కోకరహస్యంబులు దెలుపువారును బచ్చలగచ్చుటంచుల పంచతిన్నియల పన్నియలు మెఱయ విటులతోడం గూడి పన్నిదంబులు సఱచి పంతంబులు నిగుడ దంతంపుసారెలు పసిఁడిసరిగకుట్టుల్ల పట్టుపాళ్ళీల నొడ్డి కరమూలరుచిజాలంబులు పిసాళింపం గంకణంబులు గల్లనం బాచికలు వైచి వినోదంబుగా జూదంబు లాడువారును నిద్ద తిద్ద తొద్దికయై రొక్కొక్కదారి బకదారిపులుఁగుల గులకరింపు బలువగలుగల కలహంస కారండవ క్రౌంచక శుకప్రముఖ పక్షివిశేషరవంబులుత్త్రంత మెఱయఁ గంఠనాళంబుల నభ్యసించువారును జిత్రఫలకంబులఁ జతురత్వంబు బెరయఁ జతురశీతి బంధంబులు లిఖియించువారును జీటికిమాటికిం గలహించి వచ్చు విటీజనంబులకు మర్మంబులు

దగం దగవు లేర్పఱుచువారును నాకర్షణవశీకరణాద్యౌషధవిశేషం
బులు గూర్చి పాటవంబునం గరాటంబులం జేర్చువారును నొండొ
రుల నెఱుఁగకుండ ననుపుకాండ్రు మచ్చికలం దెచ్చి యిచ్చు వెండి
మిన్న లెన్నికొని యుల్లంబు లలర వల్లంబుల నించి తల్లులకుఁ
గాన్కలు సేయువారును, జతురవచనరచనఁ బాటి గలచేటికలు మా
టిమాటికి విటులరాక లెఱిఁగింప నంగీకరించి ప్రత్యుత్తరంబు లొసం
గువారును గాయకులు ప్రేమంబున నెమ్మేనఁ గమ్మగందంబు లలందఁ
గొందఱు సురటులు విసర నిద్దంపుఁ జికిలియద్దంబులు చూచి తిల
కంబులు దిద్దుకొనువారును ముద్దురాచిల్కలకు భుజంగుల రాకొట్టి
పిలుచు వగలు నేర్పువారును నై యిచ్ఛావిహారంబుల నుండు వార
కాంతలం బిలిచి మిమ్ము నందఱ రాజసమ్ముఖమ్మునకు రమ్మని యాన
తిచ్చి రని పలికిన. ౧౦౫

సీ. మదనసంజీవని మంజువాణి ఖతాణి
రాయంచ యపరంజి రాయమెచ్చు
నెఱజాణ వింతనాణె మొహూరి బాగరి
కన్నెలేడి విటారి కనకరేఖ
వగలాఁడి యొఱకతె జగపాత్ర బిత్తరి
రతిసురథాణి వజ్రంపుఁ దళుకు
కస్తూరివీణ చొక్కపు మానికపుబొమ్మ
ముద్దులరాచిల్క మోహనాంగి
కలికి సొబగులసోన చెంగలువబంతి
మేలి(టా)తా నక్షత్తునక క్రొమ్మెఱుఁగుఁదీఁగ
యనఁగ నుతికెక్కి నగరికొల్వునకు వచ్చు
వేశ్యలందఱు నప్పుడ వేడ్క చెలఁగ. ౧౦౬

గీ. రా కళావతి రమ్ము చంద్రముఖి రావె
బాలకోకిల రాఁగదె పద్మగంధి
యనుచు నొండొరుఁ జీరుచు నతిరయమున
వెంట నుడిగంపులేమలు వేడ్కఁ గొలువ. ౧౦౭

సీ. బిగువుఁ జన్గవమీటువగ లెల్లఁ గనిపించు
నఱజాఱుఁబయ్యెద లంద మొందఁ
జెలువంపునెఱికకుచ్చెలలపైఁ బచ్చరా
మొగపుల రొుడిదారములు వ్రేసంగ
సన్నగేదఁగిరేకువన్నె చొక్కపు కీలు
జడలు పిఱుందుల సందడింపఁ
జెక్కుల డిగ్గఁబూసిన మేలిజవ్వాది
నిగ్గువాసన దిశ ల్నిండికొనఁగ
గిలుకు మట్టెలు మొరయంగఁ గులుకునడలు
జీనిబంగారు సురటులు పూని రోమ
పాదు దగ్గఱ కేతెంచి పార్శ్వములను
నిలిచి యందఱు ప్రొక్కి వినీతి మెఱయ. ౧౦౮

గీ. వచ్చి కస్తూరి బరిణలు దెచ్చి వేడ్కఁ
గానుకగ నిచ్చి పద్మరాగంపు మొగపుఁ
గడియములు గల్లుగల్లనఁ గరయుగములు
మొగిచి నిలిచిన నృపతి లేవగవు నిగుడ. ౧౦౯

ఉ. కామినులార యిప్పు డొకకార్యము గల్గిన దీరలేఁగి శో
భామహితాంగలీలల విభండకసూనుని లోనుజేసి యా
భూమికిఁ దోడితేవలయుఁ బుణ్యుఁ డతం డిట మెట్టినంతనే
సీమకు సేమమౌ ననుచుఁ జెప్పెద రెల్లజను ల్నిజంబుగన్. ౧౧౦

సీ. మృగవిలోచనలార మీనిడువాల్జడల్
వాతాశిమహిమ నివారకములు
నలినాక్షులార మీనగుముద్దుమొగములు
ద్విజరాజధైర్యావధీరణంబు
లలివేణులార తేనెలు మించు మీవచో
మాధురి శుకమోహసాధకంబు
కామినీమణులార మీమందయానము
ల్పరమహంసభ్రమాపాదకములు

కమలముఖులార మీయుబ్బుగబ్బిగుబ్బ
చన్నులు గిరీశగౌరవోచ్చాటనంబు
లింతమహిమంబు గలుగు మీయంతవారి
కలమునీంద్రుని వలపించు టనఁగ నెంత. ౧౧౧

ఉ. నేలకు మింటికిం దొడరి నేర్పున సూత్రమువన్న, మందఁ గుం
చాలనుగోల్వఁ ద్రాళ్ళసుకచాలునఁ బేనఁగఁజుక్కలెన్నఁ జ
ట్రాలనునారలొల్చి నగడ న్వడఁగండ్లను గుళ్లఁగట్టఁగాఁ
జాలినమీకు నిచ్చటికి సంయమిఁ దెచ్చుట యేమిచోద్యమో. ౧౧౨

ఉ. మచ్చికచేసి యెట్లయిన మానినిభామిని ఋశ్యశృంగునిం
దెచ్చిన మీకు నందఱకుఁ దెప్పలుగా మణిభూషణంబులే
నిచ్చెద నంతిమాత్రమె మహీశ్వహిక్షైమనట్లుగా సభన్
మెచ్చెద వేగ నావలుకు మేకొని పొం డట నిండువేడుకన్. ౧౧3

చ. వినుఁ డల ఋశ్యశృంగముని వేదవిధిజ్ఞులలోనఁ బెద్ద నాఁ
జనునఁట బ్రహ్మచారియఁట సంతతముం బితృవహ్నిసేవసే
యునఁట తపోవనంబుననె యుండెడివాఁ డఁట మర్త్యులిట్టివా
రని యెఱుఁగంగనేరఁ డఁట యామునఁ దేఁ దగునెన్నిభంగులన్.

వ. అనిన విని వారాంగన లెల్లం గలంగి యొండొరుల మొగంబులు గ
నుంగొనుచు నమ్మహీపతి కిట్లనిరి. ౧౧౪

గీ. పుట్టుబ్రహ్మచారి పొలఁతులకూటమి
యెట్టిదో యెఱుఁగఁ డట్టిమౌని
ఋశ్యశృంగు నిటకు నెట్లు దెచ్చెద మయ్య
మునులకోపములకు వనిత లెదురె. ౧౧౫

క. ఇంతుల సంపుదురె తప
స్వంతులకడ కెందునైన వారలు గన నా
క్రింత మది నలిగి రేనియుఁ
జెంతల నెవ్వరికి నైనఁ జేరవ్వశమే. ౧౧౬

వ. అనిన రోమపాదుం డిట్లనియె. ౧౧౭

చ. మునుపు సురాధినాయకుఁడు మోహనలీలఁ జెలంగునప్సరో
గవలనె పంపుఁబో మునినికాయము దగ్గఱికంచు మీరలు
న్నివరె తలంప నేఁటికిది వింతయె కాంతల నిట్టిపట్లఁ బం
పిన సరసత్వ మింపెసఁగ మెచ్చుగఁ గార్యము లెల్లఁ జేకుఱున్.

క. అటుగను కిటునటు పలుకక
కుటిలాలకలార! మీరు గొబ్బునఁ జని యా
జటివరుని ఋశ్యశృంగుని
నిటకుం దోడ్తేరవలయు నెన్నివిధములన్. ౧౨౦

చ. అన విని యట్లకా కనుచు నవ్వెలయాండ్రును రోమపాదుచేఁ
గనకమయాంబరావలులు గైకొని సంతసమొప్పుచుండఁ గాఁ
జనిరి పదాంగదధ్వనులెసంగ మనంబుల నద్భుతంబు దా
ర్కొనఁ బురవీధిలో జనులు గుంపులు గూడుచుఁ దమ్ముఁ జూడఁగన్.

క. బంగరుపల్లకు లెక్కి మృ
దంగహుడుక్కాదికంబు లగువాద్యంబుల్
ముంగల మొరయఁగ నభినవ
శృంగారము మెఱయఁ జనిరి చెలువలు వేడ్కన్. ౧౨౨

వ. ఆసమయంబున. ౧౨౩

సీ. మనరాజు ఋశ్యశృంగునిఁ బిల్వ వేశ్యల
నంపుచున్నాఁడఁట యనెడివారు
హితులు మంత్రులుఁ బురోహితులు నుండఁగ వీరి
నంపంగఁ దగవానె యనెడివారు
నంగనలను జూడఁ డఁట వాఁడు వీఁమా
యలచేతఁ జిక్కునే యనెడివారు
వెలయాండ్ర వెంటనే వలచివచ్చినయేని
యతఁ డేడ తాపసి యనెడివారు
వాన రప్పింపఁ బుడివిప్రవరులకంటె
నెక్కుడే వాఁడు దొరలకు నెల్లఁ దలఁప

దూరమున నున్నవారలె దొడ్డవార
లనెడి వారలు నై చూచి రపుడు జనులు. ౧౨౪

సీ. షడ్దర్శనీపరిశ్రమసముంచితబుద్ధి
వాసి గన్నట్టి విద్వాంసులకును
కర్ణామృతస్యంది కవితానిరూఢిచేఁ
బ్రాఘిమించిన కవిరాజులకును
గాంధర్వసర్వస్వకళఁ గళంకము లేక
జాణలౌ జగజెట్టి గాణలకును
దత్తిలభరత మంతగాదిమతముల
వఱలెడినాట్యతత్త్వజ్ఞులకును
నిచ్చి యీకొల్వులంజల కీయఁ దగునె
పల్లకీలను హెచ్చుసంబళము బిరుదు
వాద్యములుఁ జూడ నృపులు సర్వజ్ఞులయ్యుఁ
దెలియలే రని కొందఱు పలికి రపుడు. ౧౨౫

వ. ఇట్లుపౌరు లెల్లఁ గనుంగొన రాజునానతిం గై కొని పైనంపు సొంపు లం గదలి రాజమార్గంబు గడచి చనుచుండ నయ్యవసరంబున.

సీ. కమ్మబాగాలును గత్తెఱ తెలనాకుఁ
గవిలెలు బలువన్నెగందవొడులుఁ
గపురంపుగిన్నెలుఁ గస్తురివీణెలుఁ
బన్నీటిచెంబులుఁ బసిఁడియంచు
రవికెలు జీనిసురటులు దంతపుదువ్వె
నలుఁ బట్టుకుచ్చుకుచ్చెలలకట్లుఁ
జికిలియద్దములు మంజిటికావుబరణులు
మంజిడిచేలలు మఱియుఁ గలుగు
వస్తువులుదెచ్చి యేమును వత్తు మిచట
నుండనోప మటంచు నొండొండ సొలసి
పలుకు విటులను జేరంగఁ బిలిచి వారిఁ
గొంతదూరంబు గైదండ గొనుచు నరిగి. ౧౨౬

క. పుటభేదననికటస్థలి
నట నొకచో బహుళభూరుహచ్ఛాయ సను
త్కట మగు నుపవనమున నొ
క్కట యించుక సేపు నిలిచి కూర్మినటింపన్. ౧౨౮

చ. ఇటనట మోముద్రిప్పి వెడ యేడ్పులు దెప్పుచుఁ గన్నుఁగోనలం
బొటపొటరాలునశ్రుకణము ల్కొనగోళ్లను మాటిమాటికిం
జిటుకుచిటుక్కనం జెదరఁ జిమ్ముచు గద్గదికం దొలంకు ము
చ్చటపలుకు ల్చెలంగ బిగిచన్నవపోఁకఁగఁ గౌఁగిలించుచున్. ౧౨౯

సీ. రాజనావతి మీఁదరాదు గావున మాకు
నీవేళఁ బైన మై పోవవలసెఁ
బోయిన నేమి గొబ్బున వచ్చెదము మిమ్ము
నొకపూఁట చూడక యుండఁగలమె
మునిఁ దోడుకొని వచ్చు పని గాన యరయంగఁ
బదినాళ్ళు కట్టిఁ బట్టు నచట
నేము పోయినకార్య మీఁడేఱ దేవళ్ళ
కును మ్రొక్కుకొనుఁడు మాకొఱకు మీరు
వగలఁ బొగులంగ వలదు రేవగలు మాను
మనసులోనన యున్నార లనుచు వారి
మగుడఁ బురమున కనిచి యమ్మగువలంత
మ న్మథాసులఁ బ్రార్థింప మదిఁ దలంచి. ౧౩౦

సీ. ఒంటిగాకుండ మావెంటనే నడపుమీ
సుమచాప చాపబాణములు పూని
వనమార్గములను గావలి గాఁగ నిలుపుమీ
సంతతంబు వసంత సంతసమునఁ
బవనమా ప్రాణంబుప్రాణమై యుండుమీ
హాయన మది నెడఁబాయ కెపుడు
వడఁ దాఁకకుండ మాకడనె చరించుమీ
చంద్ర వెన్నెలతేట చల్లికొనుచు

మేకములను గూడి వేడుక మెలఁగుచుండు
ఋశ్యశృంగుని బట్టఁ బోయెదము కడఁగి
యనుచు మన్మథ మథు మరు దమృతకరులఁ
బ్రార్థనలు చేసి యవ్వేలఁ బయనగతుల. ౧౩౧

చ. చనిరి విభండకాశ్రమముచాయనె పోయెడిత్రోవ గాంచి య
వ్వనజవిలోచనల్ బిరుదవాద్యనినాదము పార్శ్వసీమలం
ఘనవనకుంజగర్భములఁ గ్రమ్మి గుబుల్కొనుచుండ నవ్యకాం
చనశిబికాధిరూఢలయి చక్కనిచెల్వలు వెంటఁ గొల్వఁగన్. ౧౩౨

వ. ఇత్తెఱంగున నవ్వారాంగనలు కనకపల్యంకికారూఢలై యురుగలం కులం బొంకం బగు కుంకుమవన్నెగాలితెరచీరలు దిగుపాఱకుండం బట్టు పన్నాగంబులమీఁదఁ బర్నుగా నెత్తి కట్టించి కట్టాణిముత్తి యాపు గుత్తంపుఁ గమ్మపంజులయందులం దుళుకించు వజ్రపుఁదళుకుల జిగిబెళకులంగలసి మాటికిఁ దేటమిటారి తెలిచూపుఁగోపులు క్రేళ్లు దాఁట నిట్టట్టు గనుంగొనుచుఁ గదంబంపు మేపూఁతలపరిమళం బుల డంబు లతిదూరంబులుగాఁ బేరెంబులు వాఱ సారెకుం దెలి సాలెజిలుఁగుఁ బయ్యెదలు గదల సురటులు గొని విసరుకొనుచు వడ దాఁకకుండ నెడనెడం బన్నీరు చిలికిన చేపావడల మొగంబులు దుడిచికొనుచు నుడిగంపుఁ జేడియలచేతి నిద్దంపుటద్దంపుబిల్లలు గొని యప్పటప్పటికి సింగారంబులు చెదరకుండం జూచికొనుచుఁ గుసుమిత లతాకుంజపుంజగుంజన్మధురమధుప ఝుంకారధారాపూరి తంబు లగువనాంతరాళంబులఁ దఱిసి యొక్కదిక్కున వనోకహానిష్కు హకుహరంబుల నొక్కట గుబ్బిలు నిజరతికూజితానుకారి పారావ తారావంబులు వినుచు నొక్కచక్కిఁ జక్కని కేకినాట్యంబు లవలోకిం చుచు నొక్కచోట నొక్కటొక్కటి తెక్కలం గప్పుచు ముక్కుటంపు ముక్కువం జొక్కు చక్రవాకదంపతులసొంపు దర్శింపుచు నొక్కచాయఁ బాయక గుత్తంపుఁ బూగుత్తులు హత్తికొనం బున్నాగంబులం బెసం గొన్న కన్నెలేఁగియల బాగులు విమర్శించుచు నొండొక్కయెడం

బోడవుగా వివిధతాళంబు లుగ్గడించుచు గట్టువానట్టువ లనంబూపట్టు
భరతంపుఁ బిట్టలకట్టళ్లు మెచ్చుచు వేతోక్త సరసఁ గిసలయగ్రాస
కషాయకంఠకలకంఠగానంబు లాలకించుచుఁ దటరుహాతరుభ్రంశి
కుసుమవాసనావిశేషంబులం బాటిల్లు నేటికాలువలదండ నొండొండ
కష్మని చలిదివఁటకంబులు భుజించుచుఁ దేటతెలినీరు గ్రోలుచుఁ
గొలంకుల కెలంకుల నింపుదొలంకు సంకులకలహంస సారస క్రేం
కారసారస్యంబులు మెచ్చుచు నందంద మందగంధవహాకిశోరంబులు
శ్రమంబు లాఱంజేయుచుండం జని చని యవ్విభండకమహర్షి
యాశ్రమంబున కనతిదూరంబున నొక్క యెడం బల్లకు లునిచి పాద
చారంబున నరిగి యంత. ౧౩౩

సీ. యాయజూకనికాయహూయమాన నవీన
సాన్నాయ్యసౌరభ్యసంభృతంబు
పర్ణశాలాభ్యర్ణ భాగసౌఖ్యనిషణ్ణ
రోమంథచలదోష్ఠరోహితంబు
శాఖాగ్రలగ్న కాషాయవల్కలకాంతి
నిత్యపల్లవితావనీరుహంబు
హోమధూమస్తోమ జీమూతమాలికా
లోకనోత్సవనటత్కేకిగణము
సకలనిగమ పదక్రమోచ్చారణక్ష
శుకకృతాచార్య విశ్రాంతి సుఖమునైన
యలవిభండకమౌనీంద్రునాశ్రమంబుఁ
గనుఁగొనిరి వేడ్క నవ్వారవనిత లపుడు. ౧౩౪

సీ. ఉదయార్కుపై దృష్టి యునిచి యామధ్యాహ్న
ముడుగక చూచుచు నుండువారుఁ
గళదఘ్నజలములోపలనె యాసాయంబు
నడుఁకక మంత్రము లొన్నుడువువారు
బయలను వాన యెండయనాక స్థాణువు
ల్వలె నుండి ధ్యానంబు సలుపువారు

ఫలపర్ణములు చెంతఁ బడిన భక్షించుచు
నజగరవృత్తిమై నలరువారు
ఘనజటావల్లికల గిజిగాండ్లు గూండ్లు
లిడఁగ లయయోగనిష్ఠులై యెసఁగువారు
నగుచుఁ దపములు సేయు మహర్షివరులఁ
జూచి యాయబ్జలోచన లాశ్చర్యపడుచు. ౧౩౫

క. ఇది సకలపుణ్యసదనం
బిదె పో యలబ్రహ్మలోక మెంచఁగ ననుచున్
మది వెఱఁ గందఁగ నెంతే
మదవతు లయ్యాశ్రమంబు మహిమలు గనుచున్. ౧౩౬

వ. అయ్యాశ్రమంబుఁ బ్రవేశించి యొండొరులతోడ. ౧౩౭

క. సకసకఁ గానులు వెకకఁగ
సికతాకలశములఁ జలుపచెలువొందఁగఁ జె
ట్లకు నీళ్లు వోయుమునిక
న్యకలప్రభావంబు గంటె నలినదళాక్షీ. ౧౩౮

క. బంగారు వెండి గొలుసుల
భంగింగంతములఁ గోడెపాములు పెనఁగన్
ముంగిసలు పర్ణశాలల
ముంగిళ్లం బరువులిడెకుముద్దులు గంటే. ౧౩౯

గీ. మక్కువ చెలంగఁ దమ లేఁగ లొక్కపక్కఁ
బులికొదమ లొక్కపక్కను బొదుఁగుదూఁటి
చన్గుడువ నట్టు లిటునటు సాఁచిసారె
వాని మైనాకుచుండు గోవ్రజముఁ గంటె. ౧౪౦

సీ. ముదితాపసులచేతి యుదకుండికలు తొండ
ములఁ దెచ్చుగజపోతములను గంటె
వలచుట్టికొనుచు నివ్వరివెండుగలకుఁగా
వలియుండు జింకపిల్లలను గంటె